A—IPL D101835
3383
605

దైవనిర్ణయం

*

రచన:

ఇచ్ఛాపురపు రామచంద్రం

*

ప్రభాత్ పబ్లిషింగ్ హౌస్
మెయిన్‌రోడ్డు, తెనాలి.

B

మొదటి ముద్రణ
అక్టోబరు 1965

వెల : 3-00

ప్రచురణ నెం. 14

ముద్రణ :
అజంతా ఆర్టు ప్రెస్,
తెనాలి.

౮

మిత్రుడూ, స్నేహశీలీ అయిన రాజుకి....

కృతజ్ఞతలతో....

రామచంద్రం.

ఆశ అనే దారాన్నాలంబనంగా చేసుకుని ఎగిరే జీవితమనే గాలిపటం- ఆశాతంతువు తెగిపోతే ఎక్కడ రాలుతుందో ఎవరూ ఊహించలేరు. దారం తెగినంత మాత్రాన గాలిపటం ముళ్లపొదలలోపడి నాశనం కావవసరం లేదు. మనిషికంటె చిత్రమైనది మనస్సు దీన్నర్థం చేసుకోగలగడం అసంభవమేమో అన్పిస్తుంది. మమతామమకారాలూ, రాగద్వేషాలూ అన్నిటికీ మూలస్థానమైన హృదయం ఎంత శక్తివంతమైనదో అంత బలహీనంకూడా.

ప్రేమ!...నిర్వచనానికందని చిత్రమైన భావం.

మనం ప్రేమించినవారు మనకు దక్కుతారనిగాని, మనని ప్రేమించినవారికి మనం లభిస్తామనిగానీ ఏమీ చెప్పలేం. మన అదృష్టదురదృష్టాలు జీవితమే నిర్ణయించాలి.

గ్రంథాలయం, తెలప్రోలు :: కృష్ణా జిల్లా

దైవనిర్ణయం

1

ఎక్కడో దూరంగా కొట్టిన పది గంటలు మధుమూర్తికి వినిపించలేదు. రివ్వున చలిగాలి వీస్తున్నా కిటికీ రెక్కలు మూయకుండా నిశ్శబ్ద నిశీధిని పరికిస్తూ కూర్చున్నాడతను. ఇంటిముందు రోడ్డు నిశ్శబ్దంగా ఉంది. ఆ రోడ్డు మీద ప్రజలంతగా రాకపోకలు జరపని కారణంగా పది గంటలకే అది విశ్రాంతిగా నిదుర పోతుంది. మునిసిపల్ దీపాలుకూడా మత్తుగా బద్ధకంగా మసక వెలుతురు ప్రసాదిస్తూ నిల్చున్నాయ్.

నిశీధిని చూచి చూచి విసుగెత్తిన మధుమూర్తి ఆవలిస్తూ పుస్తకం తెరిచాడు.

పేజీలు అప్రయత్నంగా తిరిగిపో సాగాయ్.

కాలచక్రం వేగం తగ్గించుకుందేమో అనిపించిందతనికి.

మధుమూర్తివంటి బ్రహ్మచారికి కాలం గడవటం కొంచం కష్టమే. విరివిగా స్నేహితులో, నిద్రవచ్చే వరకూ తిరగ గలగడానికి కాళ్లలో ఓపికో, ఇవేవీ లేక పో తే- కాలంతో పోట్లాడ టానికి పుస్తకాల వంటి ఆయుధాలో ఉండాలి. మనుషులతో స్నేహ సంబంధాలు పెంచుకో డానికి సామర్థ్యమూ, సరదా-రెండూ లేని మధుమూర్తి పుస్తకాలతోనే పరిచయం పెంచుకున్నాడు. ప్రతి రాత్రీ పదకొండు గంటల వరకూ అతనికి పుస్తకాలే కాలక్షేపం ప్రసాదిస్తాయ్.

చదువుతున్న నవలలోమునిగి తనవితానే మరిచి పోయిన మధుమూర్తి ఉల్లిపడిలేచేడు.

వరండాలో అడుగులచప్పుడు !

ఆశ్చర్యంగా తలుపు తెరిచేడు.

చీకట్లో - ఏదో మానవాకారం - నిలువలేక నీరసంతో తూలుతూ... ఆత్రుతగా దీపంవేసేడు.

ఎవరో స్త్రీ - చైతన్యం కోల్పోతూంది. కనురెప్పలు వాలిపోతున్నయ్. మధుమూర్తి గుండెలు జలదరించాయ్.

ఈ పరిస్థితిలో ఏం చేయాలి ! ఆమెను లోనికి తీసు కెళ్తే... కర్తవ్యాకర్తవ్యనిర్ణయం కాకుండానే అతనామెను లోపలికి నడిపించి మంచంమీద పరుండజేసేడు.

అలసి సొలసిన ఆమె ముఖంపై కూజాలోచన్నీటిని కొద్దిగా చిలకరించాడు. ఆమె ఒక్కసారి భారంగా కనులు

తెరిచిచూచి మళ్ళీ అంతలోనే సుషుప్తిలో మునిగిపోయింది. ఏం చెయ్యాలో అర్థంకాని మధుమూర్తి ఒక్కసారి వరండా లోకివచ్చి చుట్టూ కలయజూసేడు.

ఎటుచూచినా నిశ్శబ్దం. ఎక్కడా అలికిడిలేదు.

అయితే తనామెను గదిలోకి తీసుకెళ్ళడం ఎవరూ చూడలేదన్నమాటే.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడతను.

దీపంవెలుగులో మంచంపై నిద్రిస్తున్న ఆమెను నిశితంగా చూసేడు.

ఆమె వదనంలో సౌందర్యమూ సంస్కారమూ ఉట్టిపడుతున్నయ్. ధరించిన వస్త్రాలుకూడా ఆమె పెద్ద కుటుంబానికి చెందినదనే సూచిస్తున్నయ్.

ఎవరీమె! ఈ రాత్రివేళ వంటరిగా స్పృహగోల్పోతూ ఎందుకొచ్చిందిక్కడకు!

ప్రశ్నలైతే చాల రేకెత్తేయ్. కాని ఒక్కదానికీ సమాధానం తెలియదు. అన్నీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయ్.

అనుకోకుండా తలుపువేసి దీపం ఆర్పబోయాడు మధుమూర్తి. అంతలోనే ఆలోచనలు!

గదిలో మంచంపైఆమె - చాపమీద తనూ - ఇద్దరే ఉన్నారు. తామిద్దరికీ ఏ విధమైన సంబంధమూలేదు. ఈ

పరిస్థితిలో ఎవరైనాచూస్తే ... ఎంత రాద్ధాంతం జరుగు తుందో! ఇప్పుడు తను చేయవలసినదేమిటి! ఆమెను లేపి వెళ్ళిపొమ్మనాలా! వళ్లతరబడి నిద్దే ఎరుగనట్లు పడుకున్న ఆమెను లేపడం తనకసాధ్యం. ఒకవేళ ఆమె మేల్కొన్నా వెళ్లగలిగే పరిస్థితిలో లేదన్నది పరమసత్యం. అదీకాక నీరసంగా నిద్రిస్తున్న ఆమెను గెంటివేయడం అమానుష త్వమే ఔతుంది.

పోనీ ఎవరినైనాపిలిస్తే...! ఏమనుకుంటారు!

తనవంటి బ్రహ్మచారి యీ పరిస్థితిలో నిజంచెప్తే మాత్రం ఎవరు విశ్వసిస్తారు! నిజం నిజంగా నిరూపించ బడలేని యీ విపత్కర పరిస్థితిలో నలుగురినీ పిలిచి వారి అనుమానాల ఊబిలో తను చిక్కుకునేకంటే ఈ విషయాన్ని రహస్యంగా ఉంచడమే మేలు.

దీపం సూటిగా కళ్లల్లో పడుతుంటే భరించలేక పెద్ద దీపం ఆర్పి బెడ్ లైట్ వెలిగించి చాపమీద కూర్చు న్నాడు మధుమూర్తి. రూమునిండా మసక వెల్తురు కమ్ముకుంది. అది వెలుగుకాదు. చీకటీ కాదు. చీకటికీ వెలుగుకీ మధ్యగల విచిత్రమైన దశ.

అస్పష్టమైన ఆ కాంతిలో కూడా ఆమె రూపం స్పష్టంగా గోచరిస్తూనే ఉంది ఆమె నిమీలిత నేత్రాల వెనుక ఏదో వ్యధ! ఆ సౌందర్యం వెనుక మనసు చివుక్ మనే విషాదం!!

కొద్ది క్షణాలు నిర్నిమేషంగా చూస్తూ ఉండిపోయాడు మధుమూర్తి.

ఆమె మెడలో సన్నని బంగారు గొలుసు మినహా మరేమీ లేవు.

బహుశా అవివాహితురాలేమో!

అనేక ఊహాలతో మేను వాల్చిన మధుమూర్తి కొద్ది సేపటికే సర్వమూ మరచి సుఖంగా నిద్రపోసాగేడు.

తెల్లవారింది.

మధుమూర్తికి మెలకువ రాలేదు. రాత్రి చాలా ఆలస్యంగా పడుకోవటాన ఉదయం ఏడు గంటలైనా అతను లేవలేక పోయాడు.

వరండాలో గడియారం ఏడు గంటలు కొట్టింది.

రంగనాథంగారు మార్నింగ్ వాక్ పూర్తిచేసుకొని ఇంట్లో అడుగు పెట్టేరు.

"ఛీ ఛీ ... ఇటువంటి మనిషను కోలేదు"

కాఫీ గ్లాసందుకో బోతున్న ఆయన భార్య మాటలు విని ఒక్కసారామె ముఖంలోకి చూసేరు.

"ఇన్నాళ్లూ ఏమీ ఎరుగని అమాయకుడిలా నటించి మరీ ఆ అతి మంచితనం చూసి నేనప్పుడే అనుమానపడ్డాను. కాని తండ్రీ కూతురు కలిసి నామాట పడనిస్తేగా!"... తన ధోరణి కొనసాగించేరు పార్వతమ్మగారు.

ఆవిడధోరణి భరించలేకపోయారు రంగనాథంగారు.

"ఏమిటీ నువ్వనేది ? అసలేం జరిగింది ?" అన్నారు కోపంగా.

"ఇంకా ఏం జరగాలి ? ముఖంచూచి మహాబుద్ధిమంతుడని నెత్తికెక్కించుకున్నారు. దానికి తగ్గట్టే అతనూ చేసేడు. ఇటువంటి భ్రష్టుడికి గది యిచ్చామని తెలిస్తే ఇక మన అమ్మాయికి పెళ్ళైనట్టే. అయినా పెళ్ళికెదిగిన పిల్లనింటబెట్టుకుని తోవంటబోయే ప్రతి అడ్డమైనవాడికీ ముందు వెనకలాలోచించకుండా గది యివ్వొద్దని ఆనాడే మొత్తుకున్నాను. అసలు నామాట ఎప్పుడేనా విన్నారా ! వింటారా !" తరుణం దొరికిందేచాలని తరతరాల చరిత్ర చెప్పుతూ భర్తమీద విరుచుకుపడసాగిందావిడ.

సముద్రపు హోరులాటి ఆవిడ వాక్ప్రవాహంలో అతి స్వల్పమైన భాగంమాత్రమే ఆయన చెవులకి సోకింది. దాన్నిబట్టి ఆయన అర్థంచేసుకోగలిగింది దాదాపుఏమీ లేదు.

ఒక్కసారాయన భార్యవేపు ప్రశాంతంగా చూసేరు. పార్వతమ్మపై ఆయనకు జాలివేసింది.

విద్యా సంస్కారాలులేనిస్త్రీకి ఆవేశమే తప్ప ఆలోచన తక్కువ. ఇన్నిమాటలు మాట్లాడినా ఆమె ఎవరిని గురించి ఏమంటూందో కొంచెమైనా అర్థంకాలేదు తనకి. ఈ లోపం తనదో ఆమెదో ! ఐనా యీ ఆడవాళ్ల మాటలకి కర్త కర్మ క్రియలుండవు. తాము చెప్తున్నవిషయం ఎదుటి

వాళ్ళకెంత అర్థమౌతుందో ఆలోచించకుండా మాట్లాడుతూ పోతారంతే.

"పార్వతీ!..."

ఆ పిలుపువిని ఆమె తెల్లబోయి భర్త ముఖంలోకి చూసేరు. భర్త అలా పిలిచారంటే అర్థమేమిటో ఆవిడకి బాగా తెలుసు.

"నువ్వు చెప్పదలచుకున్నది సూటిగా నాకర్థమయ్యేలా చెప్పావు!

"ముందు గదిలో మధుమూర్తి..."

ఒక్క క్షణం ఆగేరు పార్వతమ్మగారు.

"అతను... నిన్న రాత్రి..."

"ఊఁ... నిన్నరాత్రి... ఏంచేసేడు!"

"ఎవత్తినో బజారుదాన్ని గదికి తీసుకొచ్చి..."

రంగనాథంగారి ముఖం పేలవంగా మారింది.

"మధుమూర్తి... నిజంగా ఇలాటిపని చేశాడా!" కోపంగా చూసేరాయన పార్వతమ్మగారి వంక.

పార్వతమ్మగారు భయంగా తల దించుకున్నారు.

"ఈ విషయం నీకెలా తెలుసు!" కఠినంగా ప్రశ్నించారాయన.

"పొద్దుట రంగమ్మ వస్తూంటే గేటుదగ్గిర ఎవరో ఆడదాన్ని చూసిందట. అది మన గేటుతీసి రోడ్డుమీాదకు వెళ్ళిందట. అంతేకాదు. మధుమూర్తి గది తలుపు తెరచి ఉంటే తుడుద్దామని వెళ్ళేసరికి అతని మంచం మీాద పువ్వులు పడున్నాయట. వరండాలో గాజుముక్కలు... పువ్వులు... అన్నీ నాకూ చూపించింది. నా కళ్ళతో నేను స్వయంగా వాటిని చూసేను. రోజూ ఆరుగంటలకే లేచే అతనివాళ ఇంతవరకూ లేవలేదు. సాక్ష్యం యింకచాలా! ... ఈ సారి శాంతంగా ఆలోచించండి.

ఏనా పెద్దవాళ్ళు తెలివితక్కువగా అనలేదు 'బ్రహ్మచారీ శత మర్కటః' అని !..."

"ఇక నీ పురాణం ఆపు ! ... విషయమేమిటో నేనే కనుక్కొస్తాను." ఆవేశంగా లేచేరాయన.

వంటింట్లోకూర్చుని వారి సంభాషణ వింటున్న ప్రభావతికి ఒక్కసారి తలపై పిడుగుపడినట్లైంది.

మధు ! ...మధుమూర్తి ...ఎవరినో తీసుకొచ్చాడా! నిజమేనా ! ఆమె కనులు నీటితో నిండిపోయాయ్ !

దుఃఖంతో ఆమె హృదయం భూమికంటె భారంగా మారిపోయింది.

ప్రభావతి మధుమూర్తిని ప్రేమించింది !...

అందంగా, అమాయకంగా ఉండే మధుమూర్తి ఆమెనపరిమితంగా ఆకర్షించాడు.

ఆకర్షణ ఎలా ఉదయిస్తుందో ఎవరూ చెప్పలేరు. కాని ఒకసారావలయంలో చిక్కుకుంటే వెలికి రావడం కష్టం.

ఇంట్లో చేరిన కొద్దికాలంలోనే ప్రభావతి హృదయంలో కూడా స్థానం చేసుకున్నాడు మధుమూర్తి.

నూతివద్ద స్నానంచేసే అతన్ని... అరుణ కిరణాలలో అద్భుతంగా మెరిసిపోయే అతనిఅందాన్ని తన మనసులో ముద్రించుకుంది ప్రభావతి.

అతని సౌందర్యం... ఆ ముఖంలోని గంభీరత ... అన్నీ ఆమెకు ప్రత్యేకంగానే కన్పించసాగేయ్.

అప్పుడప్పుడు తండ్రి ఆజ్ఞాపించినప్పుడు ... అతనికి తను కాఫీ అందించేది.

సాధారణంగా కాఫీ తాగని మధుమూర్తి... తనిస్తే వద్దనకుండా తీసుకునేవాడు. అతని అంగీకారం- తనపై తనికే గర్వం ముంచుకొచ్చేది. గ్లాసు అందిస్తున్నపుడు అతని వేళ్ళకీ తన వేళ్ళకీ మధ్య ప్రవహించిన అందమైన అనుభూతి- జన్మజన్మాలకీ మరచిపోలేదు తను.

పొరపాటున అతని చూపులు తనకెదురైతే... ఆ క్షణాల్లో తన శరీరం ఎవరో చక్కిలిగింతలు పెట్టినట్లే జలదరించేది. ఆదివారపు మధ్యాహ్నాలు ఎండ పడుతున్నా పట్టించుకోకుండా నిద్రపోయే అతన్ని- తను దొంగతనంగా చూసి మురిసిపోయేది.

తన యింట్లో... ముందుగదిలో అతను చేరడంతో.. తన జీవితమే మారినట్లు భావించింది.

ఒక రోజు... ఆనాడు తన పుట్టినరోజు.

నాన్నగారతన్ని భోజనానికి పిలిచారు.

అతనికి వడ్డిస్తూ... ఎన్ని ఊహలు రేపుకుందో తను!

ఇటువంటి అవకాశమే తనకు జీవితాంతమూ కలగ జేయమని మొక్కుకుంది.

మధుమూర్తి !... తన ఆశాసౌధాలకు పునాది !!. తన కలలకూ కోరికలకూ మూల స్థానం!!!

అతనేనా ఇటువంటి అన్యాయం...!

తను ఊహించిన ఔన్నత్యం అతనిలో లేదా!

సౌందర్యమూ సద్గుణాలూ కలిసే ఉంటాయన్న సత్యం అసత్యమేనా? ఇన్ని నెలలలోనూ ఒక్కసారీ అతను తనతో మాట్లాడలేదు. సూటిగా తనవంక చూడలేదు.

కారణం... తనకు తెలుసు.. అతనికి తనపై అయిష్టంకాదు. ఆ మనిషి ధోరణి విచిత్రమైన తరహా. తన ప్రవర్తనకి మరే మొగవాడైనా ఐతే యీపాటికి ప్రేమ లేఖల సంపుటాలు పంపేవాడు. మధుమూర్తి అలాకాదు. ఆ గంభీరతే అతనిలో ప్రత్యేకత. అందుకే అతనికోసం ఇంత తహతహలాడటం!

ఇటువంటి వ్యక్తి... నీచంగా... ఒక స్త్రీని... తను నమ్మలేదు... ఎక్కడో పొరపాటు జరిగింది.

అమ్మా... రంగమ్మా... పొరబడి ఉంటారు.

ప్రభూ!... ఇదంతా అబద్ధమనీ... మధుమూర్తి ప్రవర్తనలో ఏ కళంకమూ లేదనీ...

"ఏమే అలా నిల్చుండిపోయావ్!... ఆ కన్నీళ్ళేమిటి!"

తుళ్లిపడి చూసింది ప్రభావతి.

"ఏమీ లేదమ్మా!... కంట్లో నిప్పురవ్వపడి..." అబద్ధం కల్పిస్తూ కనులు తుడుచుకుందామె.

"నువ్వెళ్లి స్నానం చేసిరా, నేను పొయ్యివెలిగిస్తాలే..."

ప్రభావతి నిట్టూర్పు విడుస్తూ స్నానాల గదికి నడచింది. స్నానం చేశాక శరీరం కాస్త తేలికపడినట్లనిపించినా మనసు మరింత భారమై పోయిందామెకు.

"కాఫీ పట్టుకెళ్ళి నాన్నగారికిస్తావా!" కుంపటి నుంచి కాఫీ దింపి గ్లాసులో పోస్తూ అన్నారు పార్వతమ్మగారు.

రంగనాథం గారికి ఉదయం మూడుసార్లు కాఫీ తాగే అలవాటుంది. ప్రభావతి గ్లాసు అందుకోబోయింది.

"నువ్వొద్దులే నేను పట్టుకెళ్తాను. సరేకాని నువ్వీక అస్తమానం ఆ వరండావంక వెళ్లకు"

తల్లి విధించిన ఆంక్షశూలంలా తగిలింది ప్రభావతికి.

తను వరండాలోకి వెళ్ళకూడదు!... అంటే మధు మూర్తి రూముసంక చూడకూడదన్నమాట!!

ఒక్కరాత్రిలో ఎంత దారుణం జరిగింది! ఈ పరిణామాలు తనని మధుమూర్తినుంచి దూరంచేస్తాయా!

మధుమూర్తి గదిలో అడుగుపెట్టికూడా వెనక్కివచ్చేశారు. రంగనాథంగారు.

అతను చాపమీద వళ్లెరక్కుండా నిద్రపోతున్నాడు. కిటికీలోంచి పడుచున్న ఎఱ్ఱనియెండకూడా అతనికి తెలియడంలేదు.

'నిద్రపోతున్నమనిషిని లేపడం సభ్యతకాదు,' అనుకుంటూనే వాలుకుర్చీలో మేనువాల్చేరాయన.

మధుమూర్తికి మెలకువరాగానే వాచీచూసుకుని సిగ్గుపడ్డాడు. ఎనిమిది!... ఏనాడూ లేనిదీనాడు తనుచాలా ఆలస్యంగాలేచేడు. ఏదో తప్పుచేసినట్లనిపించిందతనికి.

నిద్రమత్తు వదిలి రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చింది. మంచంవంక చూడగానే అక్కడామెలేదు!

ఆమె ఏమైంది! వెళ్ళిపోయేటప్పుడు కనీసం కృత

జ్ఞత తెలపడానికైనా తనని లేపలేదేం! ఆ మాత్రం సంస్కారమైనా లేదా ఆమెకు!

మధుమూర్తి కామెపై కోపం వచ్చిందొక్క క్షణం. అయినా తను మాత్రం అంత గాఢంగా నిద్రపోవడ మేమి టని తానని తనే నిందించుకున్నాడు మరుక్షణంలో.

ముఖం కడుక్కుని సబ్బూ, టవలూ పట్టుకుని నూతి వంక నడుస్తున్న అతన్ని చూసి అసహ్యంగా లోపలకు వెళ్ళిపోయారు పార్వతమ్మగారు. అంతవరకూ అతనిపై అంతర్గతంగా ఉన్న ద్వేషం ఒక్క రి మళ్ళీ రగులుకుం దావిడలో.

పార్వతమ్మగారికి తన కూ ప్రభావతిని తమ్ముడైన ప్రకాశరావ్ కివ్వాలన్న ఁ ఢమైన కోరిక ఏనాటి నుంచో ఉంది. కాని ఆ సంబంధానికి ప్రభావతీ రంగనాధం గారూ యిద్దరూ విముఖులే. ప్రకాశరావ్ దుర్మార్గుడు కాకపోయినా చదువూ సంధ్యాలేని అజ్ఞాని. ప్రభావతి చదువుకున్నది. ఆమెకు మంచి వరుణ్ని తేవాలని రంగనాధంగారి తాపత్రయం. పార్వతమ్మగారికి ఆ యింట్లో అట్టే స్వాతంత్ర్యంలేదు. ఆవిడ నిరంకుశత్వ మంతా వంటింటికి పరిమితం. ప్రభావతి తల్లి మాట కెదురాడదు. కాని, సాధారణంగా తన విషయం తనే ఆలోచించుకుంటుంది. ఆమెకు తల్లివద్దకంటే తండ్రిదగ్గరే చనవెక్కువ. ప్రభావతీ రంగనాధంగారూ ఇద్దరికీ మధుమూర్తిమీద సదభిప్రాయం ఉండటం కారణంగా, మధుమూ రి పార్వతమ్మగారి కోపా

నికి గురిచేయబడ్డాడు. తన ఆశ నెరవేరకపోడానికి మధుమూర్తే కారణమని ఆవిడ అపోహ.

త్వరగా స్నానం ముగించాలని ప్రయత్నిస్తున్న మధుమూర్తిని ప్రభావతి చూడనే చూసింది. ఆరవేస్తున్న చీరల నలా వదలి పిట్టగోడవద్ద నిలుచుని అతని వంక రెప్పవేయకుండా చూడసాగింది ప్రభావతి.

మధుమూర్తి ఇవేవీ గమనించడంలేదు. ఆలోచన లన్నీ రాత్రి జరిగిన సంఘటనపైనే కేంద్రీకృతం కావడంతో అతని ప్రతి కదలికా యాంత్రికంగా కన్పించసాగింది. ఎలాగో స్నానం అయిందనిపించి గదిలో అడుగుపెట్టడతను.

బట్టలు వేసుకుని బయటకు రాబోతూంటే అతనికి రంగనాథంగారి పిలుపువినిపించి అయిష్టంగా ఆ వంక చూసేడు.

"రా బాబూ కూర్చో..."

మధుమూర్తి యిబ్బందిగా కుర్చీలో కూలబడ్డాడు.

ఏదో అడగాలన్నట్లు అతనివంకచూసే రంగనాథంగారు. కాని తనడగబోయే యే విషయాన్నెలా ప్రారంభించాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయారు.

మధుమూర్తి అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతూ తలదించుకున్నాడు. రంగనాథంగారు తనడగబోయే

దేమిటో ఊహించుకుని తనలో తనే మధనపడసాగేడు. తనుచేసినది అపరాధంకాదు. కాని అది యితరులదృష్టిలో నేరంగా కనిపిస్తుందనే తనభయం. ఐనా తప్పుచెయ్యనిదే భయపడుతున్నాడు తను. మరీ యింత పిరికివాడైతే ఎలా!

"ఎక్కడికి బయల్దేరావు నాయనా!" తనడగదల్చుకున్న విషయం వాయిదా వేసేరు రంగనాథంగారు.

"ఆఫీసుకండీ..."

"ఆదివారం పూటానా!"

"ఓ వారంరోజుల్లో ఇన్స్పెక్షనుంది"

"సరే, ... వెళ్ళిరా నాయనా..."

బతుకు జీవుడా అంటూ కదిలేడు మధుమూర్తి.

ఒంటరిగా మిగిలిన రంగనాథం గారిని ఆలోచనలు చుట్టు ముట్టేయ్. కొన్నాళ్ళ క్రిందట...

"నమస్కారండీ..."

చదువుతున్న పేపరు పక్కనెట్టి కళ్ళజోడు సవరించుకుని చూసేరు రంగనాథం గారు.

"ఎవరు నాయనా నువ్వు!"

"నాపేరు మధుమూర్తి..." తన గురించి వివరాలన్నీ చెప్పి "ఉండందుకో గది దొరుకుతుందేమో అని..." అంటూ తను వచ్చినపని సవినయంగా తెలియజేశాడతను.

ఒక్కసారా యువకుణ్ని ఆపాదమస్తకమూ పరిశీలించారు రంగనాథంగారు.

అతనికి ఇరవై కంటె ఆట్టే వయుస్సుండదు పచ్చగా సన్నంగా ఉన్నాడు. ముఖంలో సంస్కారం ఉట్టిపడుతూ చూడగానే మంచివాడన్న అభిప్రాయం కలుగ జేస్తున్నాడు.

"ఒంటరిగా ఉంటావా నాయనా!"

కులమూ గోత్రమూ అయ్యాక ఆఖరి ప్రశ్న వేసీ రాయన.

"అవునండీ." కొంచెం సిగ్గుపడుతూ మెల్లగా అన్నాడు మధుమూర్తి.

"ఈ వీధి గది ఖాళీగానే ఉందయ్యా. ఇంతవరకూ అద్దెకిచ్చే అలవాటులేదు. అందులోనూ బ్రహ్మచారులకి."

కొంచెం దెబ్బతిన్నట్లన్నాడు మధుమూర్తి "ఆ విష యంలో మీరేమాత్రమూ సందేహించ నవసరంలేదు. గౌరవ మర్యాదలూ, ప్రవర్తనా తెలిసినవాడినే ఇన్నాళ్లూ హోటల్లో ఉన్నాను. ఆ వాతావరణం భరించలేక యిలా గదికోసం వెదుకుతున్నాను. కొద్దిరోజులుచూచి నా ప్రవ ర్తన మీకు నచ్చకపోతే..."

"సరే... ఆడవాళ్ళతో సంప్రదించి రేపుచెప్తాను. రేపు సాయంత్రం కనిపించునాయనా"

''సెలవివ్వండి. రేపు మిమ్మల్ని కలుస్తాను''

''కూర్చోబాబూ కాఫీ త్రాగి వెళ్దువ్ గాని...''

''మీ ఆదరానికి కృతజ్ఞుణ్ని. నాకు కాఫీ అలవాటు లేదు. వస్తాను''

మధుమూర్తి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

రంగనాధంగారి ఆశ్చర్యానికంతు లేదు.

ఇరవయ్యో శతాబ్దపు రెండో భాగంలో - విశాఖ పట్నంలాంటి ఊళ్లో ఉద్యోగం చేస్తూకూడా కాఫీ అలవాటు చేసుకోని మధుమూర్తి - రంగనాధంగారికిసారతని మీద పూర్తిగా సదభిప్రాయం ఏర్పడిపోయింది. ఏమైనా సరే అతనికి గది యిచ్చితీరాలన్న ఉద్దేశంతో లోపలకు నడిచారాయన.

అసలు విషయం అర్ధాంగి చెవినవేసేసరికి ఆవిడ శాస్త్రమొరాయించింది. రంగనాధంగారు మరోసారి నచ్చజెప్పబోయేసరికి... ఇంట్లో పెళ్లి కెదిగిన పిల్లనుంచుకుని బ్రహ్మచారికి గదియిస్తే కొరివితో తలగోక్కున్నట్లే. బ్రహ్మచారీ శత మర్కటః. నామాటవిని అతన్ని చేరదియ్యకండి. అసలే రోజులు మండిపోతున్నాయ్. ఆ మధ్య పెండ్యాల వారింట్లో దిగిన బ్రహ్మచారి ఏం నిర్వాకం చేశాడో తెలియదు ?'' అంటూ ఎగిరిపడిందావిడ.

"నువ్వొకసారి కుర్రాణ్ణి చూస్తే ఇలా అనవ్. అతని గురించి అన్నీ కనుక్కున్నాను. అతనెవరో పరాయివాడు కాదు. మనవాడే... బాగా ఆలోచిస్తే ఏ దూరపు బంధుత్వమో ఉండకపోదు."

రంగనాథంగారి మాట నెరవేరేసరికి కొంచం కష్టమే అయింది.

కొద్ది రోజుల్లోనే మధుమూర్తి ఆ గదిలో దిగడమూ, రాత్రి భోజనమయ్యాక అతనితో కబుర్లు చెప్పుకుని నిద్ర వచ్చేవరకూ గడపడం రంగనాథంగారి కలవాటు కావడమూ జరిగేయ్.

స్నానానికి కానీ మరెందుకైనా కాని పెరట్లోకి రావలసి వచ్చినప్పుడు వంచినతల ఎత్తకుండా తన పని పూర్తిచేసుకుని వెళ్ళే మధుమూర్తిని- ఏమీ అనలేక బ్రహ్మచారులపై తానేర్పరచుకున్న ద్వేషాన్ని లోలోన దిగమింగుకో సాగేరు పార్వతమ్మగారు.

అతని నేమనేందుకూ అవకాశమే కలుగకుండా అతి జాగ్రత్తగా ప్రవర్తిస్తున్నాడు మధుమూర్తి. ఇంట్లో అతను చేరేక అర్థసంవత్సరం గతించినా ఏనాడూ అతని ప్రవర్తనలో లోపం కనిపించలేదు...

ఇప్పుడు...

రంగనాథంగారు ఆలోచించలేక పోయారు.

మనుషుల గురించి వేసుకున్న అంచనాలు దెబ్బతింటే మనసుకి బాధ కలగక మానదు.

మధుమూర్తిని మంచివాడను కున్నాడు. అతని మీద ఆప్యాయమూ అభిమానమూ పెంచుకున్నాడు.

ప్రభావతి నతనికిచ్చి, అతన్ని అల్లుడిగా చేసుకోనా లని ఆశపడ్డారు. తనెన్నో కలలు కన్నాడు. అందుకే మధుమూర్తి పొరపాటు చేశాడంటే... అందులో అంత నీచమైన పని చేశాడంటే తను నమ్మలేకపోయాడు. పార్వతీ రంగమ్మా నొక్కి నొక్కి చెబుతుంటే తనకు వారిమాటలు శూలాల్లా తగిలేయ్.

నిజంగా మధుమూర్తి...!

ఏది నిజం! ఏదికాదు!

"భోజనానికి రానాన్నా..." కూతురి పిలుపువిని ఆమె ముఖంలోకి చూడాలని ప్రయత్నిస్తూ కుర్చీలోంచి లేచేరు రంగనాథంగారు. కాని... ప్రభావతి ముఖం చూపకుండానే లోపలికి వెళ్ళిపోయింది.

2

కాగితాలు ముందు వేసుకుని కూర్చున్నాడన్న మాటేగాని మధుమూర్తికి ఏ మాత్రమూ పని సాగడం లేదు.

రూపసీ - సంస్కారవంతురాలూ ఐన ఆ స్త్రీ ఏ పరిస్థితులలో తన గదికి రావలసివచ్చింది ! అసలామె ఎవరు ! ఉదయం రంగనాథంగారు తననేదో అడగాలని మానేశారు. ఆ విషయమేమిటి !

మూడున్నరకే తక్కిన గుమాస్తాలు డ్రాయర్లు సర్దేసి ఆదివారం సాయంత్రం ఆనందంగా గడపాలని బయల్దేరేరు. మధుమూర్తి ఆఫీసునుంచి తిన్నగా రూము చేరుకుని స్నానంచేసి పుస్తకంలో లీనమయ్యాడు.

"నమస్కారం !"

అపరిచిత స్వరంవిని ద్వారంవంక చూసేడతను.

ఎవరో యువకుడు - అతని వెనుక... ఆమె !

ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు మధుమూర్తి.

"మనం యింతవరకూ అపరిచితులమే. కాని నిన్న రాత్రి జరిగిన సంఘటన..." ఒక్క క్షణంఆగి "ఈమె నా చెల్లెలు శారద బి. ఏ. నిన్నరాత్రి..." అన్నాడతను.

"నమస్కారమండీ ..రాత్రిమీకు చాలా శ్రమకలిగించే ననుకుంటాను. స్పృహ పోతూండగా కిటికీలోంచి దీపం కనిపించింది. ఆ దీపాన్ని చేరితే రక్షణదొరుకుతుందన్న ఆశతో ఎలాగో వరండావరకూ రాగలిగేను. పాపం మీరు నా కోసం శ్రమపడ్డారుకదూ"

"ఫరవాలేదు."

"ఇతను మా అన్నయ్య ప్రసాదరావ్. ఇంజనీరుగా ఉంటున్నాడు." శారద అతన్ని పరిచయం చేయగానే తనని తాను పరిచయం చేసుకున్నాడు మధుమూర్తి

"... గుమాస్తాని ..." అని చెప్పవలిసి రావడానికతను చాలా సిగ్గుపడ్డాడు.

"నిన్న రాత్రి భగవంతుడిలా కాపాడేరు. మీరాదరించకపోతే శారదగతేమయ్యేదో!... మీకు చాలా రుణపడున్నాం మధుమూర్తిగారూ! ప్రసాదరావ్ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

"ఆపత్సమయంలో ఆదుకోడం మానవుడి విధి. నేను కేవలం నావిధి నిర్వర్తించాను. ఇందులో నన్ను పొగడ వలసిందేమీ లేదు."

మధుమూర్తి మెదడు కొంతవరకు తేలికైనట్లనిపించింది. ఉదయం నుంచీ వేధించిన ప్రశ్నలలో కొన్నిటికి సమాధానాలు లభించాయ్. కాని... ఆమె అలా ఎందుకు రావలసి వచ్చిందో మాత్రం తెలియకుండానే ఉండిపోయింది. ఆ విషయం అడగాలనిపించినా సభ్యతకు విరుద్ధమేమో అని సంశయిస్తూ ఉండిపోయాడతను.

కొద్ది క్షణాలపాటు ముగ్గురూ నిశ్శబ్దంగా ఉండిపోయారు

"మీరు ఒంటరిగా ఉంటున్నారా!"

"ఊఁ..."

"మీకభ్యంతరం లేకపోతే ఆదివారం డిన్నర్‌కి మా యింటికి రావాలి. మీరు హోటల్లో భోంచేస్తున్నారా?"

"అవును"

"ఆదివారం తప్పకుండా వస్తారుకదూ?"

మధుమూర్తి మౌనంగా ఉండిపోయాడు.

ఆ ఆహ్వానం అంగీకరిస్తే శారద చరిత్ర తెలుస్తుందేమో అన్న ఆశ ఒకవంక లాగుతోంది. వేరొకవంక ఎందుకో సంకోచం.

"ఈ అభ్యర్థన నాదికాదు. శారదది, మీరు తప్పకుండా రావాలి... శారదా! నువ్వూ చెప్పాలి..."

శారద కొంచెం సిగ్గుపడుతూచూచి "తప్పకుండా రండి" అంది.

"అలాగే" అన్నాడు మధుమూర్తి.

"శారదా! నువ్వింటికివెళ్ళి కారుపంపిస్తే యిక్కణ్ణుంచే నేను సింహాచలం వెళ్ళివస్తాను"

శారద వెళ్ళింది.

"మధుమూర్తి ఆమె వెళ్ళినవంకే చూస్తూ ఏదో ఆలోచించసాగేడు.

"మధుమూర్తిగారూ!... ఏమిటాలోచిస్తున్నారు?"

తన పరధ్యానానికి తనే సిగ్గుపడ్డాడు మధుమూర్తి.

"శారద రాత్రి ఎందుకలా ప్రవర్తించిందనేకదూ!"

సమాధానమివ్వకుండా ఆత్రుతగా చూసేడు మధుమూర్తి.

"శారదకు మతి స్థిమితం ఉండదు. కొందరు డాక్టర్లు పిచ్చి, అనీ, మరికొందరు హిస్టీరియా అనీ... ఏమైతేనేం, ఎన్ని చికిత్సలు చేయించినా... ఫలితం లేకపోయింది.

అప్పుడప్పుడామెకు మతి చలిస్తూ ఉంటుంది. ఆ సమయంలో విచక్షణా జ్ఞానం నశిస్తుంది. తనేం చేస్తుందో తనకే తెలియదు. ఎక్కడెక్కడో తిరిగి తిరిగి అలసి పోతుంది. ఆ స్థితినుంచి తేరుకునేందుకు సాధారణంగా కొన్ని గంటలు పడుతుంది.

నిన్న రాత్రి మీ రూములో ఉన్నానని చెప్పింది. తెల్లవారు ఝామున మెలుకువరాగా చెప్పకుండా వచ్చేనని విచారిస్తూ కూర్చుంది. రాత్రి మిమ్మల్నెంతో శ్రమపెట్టి ఉంటానని దిగులు పడుతూ కూర్చుంటే నేనే శారదని ఇలా బయల్దేరదీశాను.

మధుమూర్తిగారూ! రాత్రి మీరే కనక ఆమెకు రక్షణ కల్పించకపోతే ఏ విపరీతం జరిగేదో ఊహించలేక పోతున్నాను. శారద స్త్రీ!.. మీరు బ్రహ్మచారులు. ఆ పరిస్థితిలో మీ రామెకు సహాయం చేయడం- నిజం

తెలియని లోకం నిందలు వేస్తుందన్న సంశయమేనా లేకుండా— మీాకు మరోసారి నా కృతజ్ఞత తెలుపు కుంటున్నాను.''

బయట కారాగిన శబ్దం వినిపించింది.

"నేను వెళ్తానండీ... ఆదివారం ఉదయం కారు పంపుతాను తప్పకుండా వస్తారుగా!''

ప్రసాదరావ్ వెళ్లిపోయాడు.

మధుమూర్తి సందేహాలు తీరిపోయాయ్, కాని మనసుకేమాత్రమూ శాంతిలేదు.

శారద!... ఆమెకు మతిస్థిమితంలేదు,

ఎంత దారుణం!... బి. ఏ. ప్యాసై ... అందం, ఐశ్వర్యం అన్నీ ఉండికూడా... ఎంత ఘోరమైన శాపం!

భగవాన్, ఎంత కఠినుడవయ్యా!

మధుమూర్తి హృదయం శారదపై సానుభూతి కురి పిస్తూ కరగి పోతూంటే అలాగే కూర్చుండిపోయాడు.

ఒకవైపు శారద సౌందర్య సంస్కారాలూ. వేరొక వైపు భగవంతుడి కఠినత్వమూ— రెండిటికీ మధ్య నలిగి పోతూందతని సుతిమెత్తని హృదయం.

దురదృష్టవంతుల జీవితాలంతే. కోరుకున్న వన్ని చేరువలో ఉన్నా సుఖం మాత్రం దూరంగానే ఉండి పోతుంది.

సుఖపడేందు కర్హతే కాదు అదృష్టం కూడా ఉండాలి. లేకపోతే సర్వ సౌఖ్యాలూ అనుభవించ గలిగే అవకాశా లుండి కూడా శారద కీ శాపమేమిటీ!

ఇదేనా భగవంతుడి లీలంటే!

వికలమైన మనస్సుతో అలాగే ఆలోచిస్తూ ఉండి పోయాడు మధుమూర్తి.

వరండాలో కూర్చుని అంతవరకూ మధుమూర్తి రూములోజరిగిన సంభాషణంతావిన్న రంగనాధంగారు విజయ గర్వంతో ఒక్కసారి ఊపిరిపీల్చుకున్నారు. తను మధు మూర్తి విషయంలో పొరబడలేదు. అతను నిర్దోషి.

ఒక్కసారాయన మధుమూర్తి గదిలోకినడిచారు.

అప్పటికిబాగా చీకటిపడింది. ఐనా మధుమూర్తి లైటువెయ్యలేదు.

రంగనాధంగారు స్విచ్ వేసేసరికి ఒక్కసారి తుళ్ళి పడి చూసేడు మధుమూర్తి. "మీరా!"

"ఒంటరిగా చీకటిలోకూర్చుని ఏమిటి నాయనా, అంత గాఢంగా ఆలోచిస్తున్నావ్!" లాలనగా అడిగే రాయన.

"ఏమీలేదు. మీరిలా కుర్చీలోకూర్చోండి" తను మంచంమీదకూర్చుని ఆయనకు కుర్చీ యిచ్చాడతను.

"నీతో చిన్నవిషయం మాట్లాడాలని వచ్చేను"

అయిష్టంగా చూసేడతను.

"నిన్నరాత్రి జరిగిన..."

మధుమూర్తి ముఖం పేలవంగా మారింది.

"కాని యిప్పుడే నిజం తెలిసింది. పెద్దవాడినైనా చెప్పుడు మాటలువిని నేనూ నిన్ననుమానించేను. నన్ను..." క్షమించమని అడగడానికభిమానమో, పెద్దరికమో అడ్డు నిలిచిందాయన కంఠంలో.

ఒక్కసారి మధుమూర్తి హృదయం తేలికపడింది.

రంగనాథంగారింకేమీ అనకుండా ఇంట్లోకి వెళ్లి పోయారు

ఆడవాళ్ళు అబద్ధాన్ని నమ్మినంత త్వరగా నిజాన్ని నమ్మలేరు. అందులోనూ ఒకసారి అపోహపడటం సంభవిస్తే ఎంత పటుతరమైన సత్యమైనా వారి అనుమానాలను తొలిగించ లేదు. అందుకే తను తెలుసుకున్న నిజాన్ని ఇంట్లో చెప్పి ఆ సత్యాని కున్న విలువను తగ్గించకూడదనే నిశ్చయించు కున్నారు రంగనాథంగారు.

ఏకాంతంలో ప్రశాంతంగా కూర్చుని ఆలోచిస్తూంది ప్రభావతి.

మధుమూర్తి... చాలా అన్యాయంగా ప్రవర్తించేడు.

ఈ విషయం ఎంత మరిచిపోదామన్నా మరపు రాకుండా ముల్లులా బాధిస్తూనే ఉంది.

పొరపాటు అతి త్వరితంగా చేసే స్వభావం మగజాతి లోనే ఉందేమో! శారీరకంగా మగవాడెంత బలవంతుడో మానసికంగా అంత బలహీనుడా! ఇన్నాళ్ళూ ఎంతో మంచివాడిలా మెలగిన మధుమూర్తి పవిత్రత నిలుపుకోవాలన్న విషయం విస్మరించేడా!

మనసిచ్చిన తనవంక సూటిగా చూడటానికే బిడియపడే మధుమూర్తి అంత సాహసం ఎలా చేయగలిగాడు! దీనికి కారణం క్షణిక దౌర్బల్యమా? లేక నిజంగా ఏదైనా బలీయమైన పరిస్థితి ఏర్పడిందా! ఎందుకో తనెంత ప్రయత్నించినా అతని బలహీనతని సమర్థించలేక పోతూంది. పైగా పొరపాటు చేసిన దతనైతే తనేదో ఘోరమైన నేరం చేసినట్లు బాధ పడుతూందెందుకనీ! ఈ భావనకి కారణం తనతన్ని ప్రేమించడమేనా!

ఈ ఒక్కసారి అతన్ని క్షమిస్తే...!

ప్రభావతి హృదయం ద్వైధీ భావంలో కొట్టుకుంది.

అతన్ని క్షమించాలి... ఊహుఁ... వద్దు...

ఎటూ తేలకుండానే ప్రభావతి తల్లి పిలుపు విని మేడ మెట్లు దిగసాగింది.

3

అనుకున్న ఆదివారం వచ్చింది.

స్నానంచేసి బట్టలు వేసుకుని కూర్చున్నాడు మధుమూర్తి. ప్రసాదరావ్ ఆహ్వానాన్ని ఆనాడు తిరస్కరిస్తేనే బాగుండు ననిపిస్తోందతనికి.

తనవంటి వ్యక్తి ఎవరితోనూ సరదాగా ఉండలేడు. తన జీవనపథం ఒక్క వెలుగు రేఖకైనా నోచుకోకుండా చీకటిలో సాగిపోవలసిందే. తనెవరినీ ప్రేమించలేడు. స్నేహం, మమత — ఇటువంటి అనుభూతులకు తన హృదయం స్పందించడం ఏనాడో మానుకుంది.

గతం తలుచుకుంటే భయం. భవిష్యత్తంతా నిరాశామయం. అయినా తను బతుకుతూనే ఉన్నాడు.

దేనికి ?... బతకాలి గనక. అంతే.

గతించిన ఐదు సంవత్సరాల నుంచీ చిరు నవ్వు లేకుండా జీవించేడు. ఇక ముందు కూడా అలాగే జీవించాలి. శారద లాగే తనుకూడా శాపగ్రస్తుడే. జీవితమంతా నిర్లిప్తంగా గడపవలసిన దరదృష్టవంతు డతను.

మధుమూర్తి గతంలోకి జారకుండా... డ్రైవరు వచ్చి కాపాడేడు. అతను రావడమేతడవుగా మధుమూర్తి అతన్ననుసరించేడు. కారు మెల్లగా కదిలింది.

"తమరేంచేస్తున్నారు బాబూ!" డ్రైవర్ మెల్లగా సంభాషణ ప్రారంభించేడు. అతని ప్రశ్నలకు సమాధానం యివ్వడం - మధుమూర్తికి సమస్యే అయింది.

ద్వారకానగర్‌లో మొదటి మలుపుదగ్గర కారు స్లో చేసి ప్రక్కనున్న గేటుదగ్గర ఆపుచేసేడు డ్రైవర్. అతను దారిచూపుతూంటే మధుమూర్తి అతనివెంట వడవడ సాగేడు.

అది మరీ పెద్దయిల్లు కాకపోయినా ఉండవలసిన హంగులన్నీ ఉన్నాయ్. చుట్టూగార్డన్-మధ్యలో మేడ. చూడటానికి చాల అందంగా కనిపిస్తూంది.

"రండి రండి ... మీ కోసమే ఎదురుచూస్తున్నాం"

ప్రసాదరావూ - శారదా ఇద్దరూ మధుమూర్తిని ఆహ్వానించేరు. మొహమాట పడుతూనే వారి ఆతిధ్యాన్ని స్వీకరించాడు.

ప్రసాదరావూ - మధుమూర్తి ఇద్దరూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు. శారద ఏదో పనుందంటూ లోపలకు వెళ్ళింది.

"ఏమేనా కబుర్లుచెప్పండి మధుమూర్తిగారు!..."

ప్రసాదరావ్ అలా అడిగేసరికి మధుమూర్తి నిర్ఘాంత పడ్డాడు. ప్రసాదరావ్ ఇంజనీరు. తను కేవలం గుమాస్తా. ఆయన కారు పంపడం-ఆహ్వానించడం - వీటికే తను తేరు

కోలేక పోతున్నాడు. తనాతనితో ఏం మాట్లాడగలడు అయినా తనకేం తెలుసు ? ఆఫీసు విషయాలు చెప్పా లన్నా తను డిస్పాచ్ క్లర్కు. పోనీ రాజకీయాల గురించో సినిమాల గురించో మాట్లాడాలన్నా - తను వాటికి చాలా దూరం. చావలేక బ్రతుకుతున్నతను.

"కాఫీ తీసుకోండి..." తలెత్తి చూసేడు మధు మూర్తి.

శారద !... తలంటు పోసుకోవడాన అందమైన ఆమె కురులు ఫానుగాలికి సిల్కు దారాల్లా ఎగురుతు న్నయ్... ఆమె కట్టుకున్న తెల్లని సిల్కుచీర- ధరించిన నీలి జాకెట్టూ— ఆమె శరీరంమీద విచిత్రంగా కాంతు లీనుతున్నయ్. పసుపు రాసుకుని స్నానం చేసిందేమో. ఆమె ముఖం పచ్చగా కాంతులీనుతూంది. ఆ అందంలో ప్రత్యేకతుంది... ఆ అందంలో పవిత్రత ఉంది. ఆ మూర్తిని చూస్తే ఆరాధించ బుద్ధవుతుంది. ఎంతటి నీచు డైనా ఆ మూర్తి సమక్షంలో పవిత్రుడిగా మారిపోతాడు. పతితుణ్ని కూడా పవిత్రుణ్ని చేయగలిగేంత ప్రతిభా వంతంగా ఉందామె దివ్యసౌందర్యం.

సభ్యత గుర్తొచ్చి— తల వంచుకున్నాడు మధు మూర్తి.

"అయితే మీరేమీ కబుర్లు లేవంటారు ?" నవ్వుతూ చూసేడు ప్రసాదరావ్. మధుమూర్తి సిగ్గుపడుతూ "పోనీ మీరు చెప్పండి. నేను వింటాను..." అన్నాడు.

కబుర్లు నాకూ చాతగావు. శారదైతే ఉదయం నుంచీ సాయంత్రం వరకూ చెప్తుంది వినేవాళ్ళుంటే..."

"పో అన్నయ్యా!"

"ఆదివారంపూటా రెస్టు దొరికిందనుకుంటూ అనం దిస్తూంటే ఇప్పుడెక్కడికి పోమ్మంటావ్ చెల్లాయ్! పోనీ ఆ క్యారమ్స్ తీసుకురాకూడదూ!"

శారద క్యారమ్స్ టేబుల్ అమర్చింది.

"రండి మధుమూర్తిగారూ!..."

"నాకా ఆట రాదండీ. మీరిద్దరూ ఆడండి..."

"మరి మీరు!"

"మీ ఆట చూస్తాను"

"బోర్ కొడుతుందేమో!"

"అబ్బే, నాకు ఏ ఆటా చేతకాదు. కాని ప్రతి ఆటా చూచి ఆనందించడం మాత్రం చేతనౌను"

శారద సన్నగా చిరునవ్వు నవ్వింది. రెండు బోర్డు లాడే సరికి "ఇంక చాల్లే అన్నాయ్. రేడియో పెట్టు కుందాం." అంటూ లేచింది.

"మధుమూర్తిగారూ!... గార్డెన్లో కూర్చుం దామా!"

"పదండి..."

పది గంటల ఎండలో గార్డెన్లో కూర్చోడమేమిటో అనుకుంటూనే ప్రసాదరావ్‌తో నడవసాగేడు మధు మూర్తి.

మేడ వెనుకగా గార్డెనుంది. చక్కగా పూలమొక్కలతో కలకల లాడుతున్న గార్డెను మధ్య ఏదో లత దట్టంగా అల్లుకుని పొదరింటిలా తయారైంది. దానికింద చాపలు పరిచి ఉన్నాయ్. ఇద్దరూ అక్కడ కూర్చున్న కొద్ది నిము షాలలో శారద ట్రాన్సిస్టర్ తెచ్చి ఆన్ చేసింది.

చల్లని వాతావరణంలో బిస్మిల్లాఖాన్ షెహనాయ్- ముగ్గురూ ఆ గానవాహినిలో మునిగి పోయారు. ఆ సంగీతం పూర్తయ్యేసరికి పదకొండైంది.

"షెహనాయి చాలా బాగుంది కదూ! ముగ్గురమూ ఒకరి నొకరం మరిచిపోయి సంగీతంలో లీనమయ్యాం ఇక లేవండి.

భోజనం తయారై వుంటుంది."

శారద హెచ్చరికతో ప్రసాదరావూ మధుమూర్తీ డైనింగ్ హాలుకి నడిచేరు.

సహృదయులైన వ్యక్తులు, చక్కని వాతావరణం అయినా మధుమూర్తి అక్కడినుంచి ఎంత త్వరగా బయట పడతానా అని తొందర పడుతూనే ఉన్నాడు మనస్సులో.

భోజనాలు పూర్తయ్యాయి. శారద, ప్రసాదరావూ మాట్లాడుతూంటే వినడమూ, వారి మాటలలో హాస్యం దర్శిస్తే ఊరకే పెదవులు మెదపడమూ- తప్ప మధు మూర్తి వారితో కలియలేక పోయాడు. ముగ్గురూ మళ్ళీ డ్రాయింగు రూములో కూర్చున్నారు.

"మీరు బొత్తిగా ముభావంగా ఉన్నారు. మొహ మాటపడుతున్నారా?"

"ఊహుఁ... అసలు నా తత్వమే అంత. ఎక్కువగా మాట్లాడడానికి నాకు భయం."

"ఐతే మీరు మహా మేధావులన్నమాట!" శారద చిరునవ్వు నవ్వింది. మధుమూర్తి తెల్లబోయి చూసేడు.

"విజ్ఞానులు తక్కువగా మాట్లాడతారని వేమన చెప్పేడుగా!"

"ఔను. మాటకంటె మౌనం గొప్పదని ఇంగ్లీషు లోనూ ఒక సూక్తి ఉంది."

"అన్నయ్యా!"

"ఏమమ్మా..."

"సినిమాకి వెళ్దామేమిటి! లీలాలో సోఫియాలోరేన్ పిక్చరుందిట!"

"వెళ్దాం. మధుమూర్తిగారూ..."

"పదండి."

"మీరిద్దరూ మాట్లాడుతూ కూర్చోండి. నేను థియేటర్‌కి ఫోన్ చేసి టికెట్స్ రిజర్వ్ చేస్తాను."

ప్రసాదరావ్ పక్కగదిలోకి వెళ్ళేడు.

"మధుమూర్తిగారూ! మీకు సాహిత్యమంటే ఇష్టమేనా!"

"ఊఁ."

"ఇంగ్లీషు నవలలు..."

"నాకింగ్లీషు అంత బాగా రాదు. ఇంటర్ స్టాండర్డ్‌తో ఇంగ్లీషు నవలలు అర్థం చేసుకోవడం కష్టం. ప్రయత్నిస్తే చదవగలిగేవాడినేమో కానీ... ఎందుకో ఆ సరదా కలగ లేదు."

"తెలుగు పుస్తకాలలో మోడరన్ లిటరేచరేనా లేకపోతే...."

"తెలుగుభాషలో నవీన సాహిత్యమే కాకుండా కొన్ని ప్రబంధాలూ కావ్యాలూకూడా చదివేను.. ఐతే అవి అర్థంచేసుకోవడం - నాకు సాధ్యంకాలేదనే అనుకుం టున్నాను"

"మీరు కథలు వ్రాస్తూంటారుకదూ!"

ఆశ్చర్యంగాచూసేడు మధుమూర్తి. ఇంత కాలమూ తనావిషయాన్ని బహుగోప్యంగా ఉంచేడు. తను కేవలం

ఊసుపోక ఏవో పిచ్చిరాతలు రాస్తాడు. అలా రాసినవి పుస్తకాలకు పంపడమూ - వాళ్లు ప్రచురించడమూ జరిగింది. కాని ఆ కథలు - పాఠకులకు వచ్చినట్లులేదు. నిజమే!... అనేక సమస్యలతో కొట్టుకుంటూ విశ్రాంతికోసం పుస్తకాలు చదివేవాళ్ళకి - విషాదం నచ్చదు. ఆ కాస్సేపైనా ఊహాలోకాల్లో తేలిపోవాలని కోరుకుంటారు. తనది బొత్తిగా నిజంచెప్పే స్వభావం. తనేంచూసేడో, ఏమనుభవించేడో అదే రాయగలడు. పేదబతుకు బతుకుతూ ఐశ్వర్యం గురించీ సుఖాలను గురించీ రాయడం తనకు అబ్బలేదు.

"చెప్పండి. మీరుకథలు రాస్తారుకదూ!" తిరిగి ప్రశ్నించింది శారద.

"అప్పుడప్పుడు..." అపరాధిలా గొణిగేడు మధుమూర్తి.

శారద చరునవ్వునవ్వింది. "మీ కథలు ఒకసారి యిస్తారా!"

మధుమూర్తి అయిష్టంగా చూసేడు. "నా కథలు - అవి నిజానికి కథలుకావు. నేను చూచిన దృశ్యాలకూ - పొందిన భావాలకూ అవి ప్రతిచిత్రాలు. వాటిలో ఊహాలోకాలూ - ఆనందసన్నివేశాలూ ఉండవు. బొత్తిగా బీదవాడి గోడులా విసుగ్గా ఉంటాయ్."

"పోన్లెండి. అవే చదువుతాను"

"శారదా!... చిన్న విషయమడుగుతాను చెప్తారా!"

"అడగండి."

"నేను కథలు రాస్తానని-ఎలా అనుకున్నారు మీరు!"

"మీ వైఖరిచూసి ఊహించేను. తరువాత మీ రూములో టేబిల్ మీద సగం రాసిన కాయితం"

మధుమూర్తి తన పొరపాటుకి తననే నిందించుకున్నాడు.

శారదేదో చెప్పబోతూండగా ప్రసాదరావ్ హడావిడిగా వచ్చి "శారదా! నువ్వెళ్ళి త్వరగా తెములు. ఈ లోగా నేనూ మధుమూర్తిగారూ తయారుగా వుంటాం. ఆలస్యం చేశావంటే సినిమా అయిపోతుంది."

కొద్దిసేపట్లో ముగ్గురూ తయారై గారేజ్ దగ్గరకు వచ్చేరు.

ప్రసాదరావ్ కారు బయటకు తీసి "శారదా, నువ్వూ ఆయనా వెనుక కూర్చోండి. నేను డ్రైవ్ చేస్తాను." అంటూ వెనుకనున్న తలుపు తీసేడు.

శారద పక్క కూర్చోడం- భయపడుతూనే కూర్చున్నాడు మధుమూర్తి.

కారు కదిలింది.

మనుషులతో- మాటలతో కాలం గడపలేని మధుమూర్తికి ఆలోచనలే చక్కని కాలక్షేపం. ఇదతనికి బాగా

అలవాటై పోయింది. జరిగిన ప్రతి విషయం గురించీ ఆలోచించ సాగేడు.

తనెవరు! ప్రసాదరావూ శారదా ఎవరూ!

తను గుమాస్తా. ప్రసాదరావ్ ఇంజనీరు. శారద అతని చెల్లెలు.

తనకూ వారికీ పోలికెక్కడ!

ఇన్నాళ్ళూ తను ఒంటరిగా తన మానాన తను బతుకుతున్నాడు. సాధారణంగా మానవులు బతికే విధానానికీ తను బతికే విధానానికి చాలా వ్యత్యాసముంది. చాలా మంది నలుగురితోనూ సంతోషంగా ఉంటారు. ఉండాలని కోరుకుంటారు. కాని తనకది అసాధ్యం. తన ప్రపంచమే వేరు.

కారు హాలు ముందాగింది. ప్రసాదరావు టిక్కెట్లు తేగానే అతని వెనుక నడిచాడు మధుమూర్తి.

అన్నిటిలోకీ చివరి వరసలో కూర్చున్నారు. మధ్యన శారదా, అటూ యిటూ ప్రసాదరావూ మధుమూర్తీ.

మధుమూర్తి అడగకుండానే అక్కడక్కడ వ్యాఖ్యానం చెప్పసాగింది శారద. నిజానికి మధుమూర్తికి ఇంగ్లీషు సినిమాలంతగా అర్థంకావు శారద చెప్తుంటే ఆమె తెలివితేటలకి ఆశ్చర్యపడుతూ వినసాగేడు

అంతవరకూ తమని ప్రక్కనున్న ఒకస్త్రీ గమనిస్తుందని శారదకీ మధుమూర్తికీ యిద్దరికీ తెలియదు.

ఇంటర్వెల్‌లో శారద కూల్ డ్రింక్ అందించింది మధుమూర్తికి.

ప్రక్కనున్న ఆ స్త్రీ వారిద్దరివంకా ఒక్కసారిచూసి వారి కంట పడకుండా లేచి వెళ్ళిపోయిన విషయం వారిద్దరూ గమనించలేదు.

సినిమా పూర్తయింది. ముగ్గురూ హాలు బయటకు వచ్చారు. ఇంతలో మేనేజరు ప్రసాదరావ్‌నిచూచి నమస్కరిస్తూ అతన్ని సమీపించేడు.

మేనేజరూ- ప్రసాదరావూ ఇద్దరూ మాటల్లో మునిగిపోయారు. శారద మధుమూర్తివంక చూస్తూ "మీరు మరీ బోరయినట్లున్నారు." అంది.

"ఊహుం... సినిమా బాగానేఉంది."

"మధుమూర్తిగారూ మీ కథలు త్వరలో చూపిస్తారుగా !"

"అలాగే..."

ఇంతలో ప్రసాదరావ్ మేనేజర్‌ని పంపివేసేడు.

"అలా బీచ్‌కి వెళ్దామా మధుమూర్తిగారూ !"

"క్షమించండి. నేను రూముకి వెళ్తాను"

"రండి కారులో డ్రాప్ చేస్తాను"

"థాంక్స్... మీ కెందుకూ శ్రమ! నేనొక స్నేహితుణ్ని కలుసుకుని రూముకి వెళ్తాను."

"గుడ్ నైట్..." శారదా ప్రసాదరావూ నమస్కరించేరు.

"గుడ్ నైట్" వారికి బదులుచెప్పి బయటకు వడిచేడు మధుమూర్తి.

జనసందోహం నుంచి బయటపడి మెల్లగా తన రూము చేరుకున్నాక స్వస్థత చిక్కినట్లయిందతనికి

ప్రసాదరావూ శారదా - ఇద్దరి సమక్షంలోనూ తను సరిగ్గా మసలలేకపోయాడు. ... వారి ఔన్నత్యం - తన అల్పత్వం - రెండూ స్పష్టమౌతూంటే తను చాల క్రుంగిపోయాడు. శారద ఎంతో పరిచయమున్నట్లు వ్యవహరిస్తే తను చాలా మోహమాటపడ్డాడు.

మనసంతా విశ్రాంతిలేనట్లు - ఎందుకో బాగా అలిసిపోయినట్లూ అన్పించింది.

శారద_ప్రసాదరావ్_తను-ఏందుకు సంభవించింది తమ పరిచయం!

రంగనాథంగారింట్లో గోడగడియారం ఎనిమిది గంటలుకొట్టింది. రంగనాథంగారు వరండాలోకూర్చొని ఏ ఉపనిషత్తో చదువుకుంటున్నారు. లోపల ప్రభావతి ఒంటరిగా కూర్చుంది.

సాయంత్రం పార్వతమ్మగారు బంధువులింటికి వెళ్లేరు. ప్రభావతి వంట చేసింది. ఇంకా పార్వతమ్మగారు రాలేదు.

ప్రభావతి ఏదో ఆలోచనలో మునిగిపోయింది. ఆమె ముఖంలో విషాదం ఆవరించుతుంది. ఎప్పుడూ చలాకీగా ఉండే ప్రభావతి నిర్లిప్తంగా మారిపోయింది.

భగవాన్! మధురమైన స్నేహాన్నీ అనుబంధాల్నీ సృష్టించినది మానవ హృదయాల్ని బాధించడానికేనా! మమత-మమకారం ఇవి కూడా మనుషుల పాలిట శత్రువులేనా!

ప్రభావతికి మధుమూర్తిపై అసహ్యం వేసింది... సినిమాలో ఆమె ఎవరో అందించిన కూల్ డ్రింక్ అందుకోవడమూ — ఆమె చనువుగా మధుతో మాట్లాడ్డమూ - చూడలేకే ఆమె సినిమా చూడకుండా యింటికి వచ్చేసింది. కాని మధుమూర్తి గురించి ఎంత ఆలోచించకుండా ఉండాలనుకున్నా అదామెకు సాధ్యం కాలేదు.

ఆనాటిరాత్రి- మధుమూర్తి పొరపాటు చేసేడని తల్లి చెప్తుంటే తను నమ్మలేదు. అదంతా అసత్యమనీ, మధుమూర్తి వంటి ఉన్నతుడేనాటికీ అంత దిగజారడనీ మనసుని సరిపెట్టుకుంది. కాని యీనాడు తన కన్నులతో తను స్వయంగా... వద్దు వద్దు... మళ్ళీ ఆదృశ్యం ఊహించుకుంటే తను నిలవలేదు.

"ప్రభా!"

"వస్తున్నానమ్మా..." ప్రభావతి తల్లి స్వరం విని పెరట తలుపు తీసింది. పార్వతమ్మగారు కాళ్ళూ చేతులు కడుక్కొని వంటిల్లు చేరారు. అప్పటికే ప్రభావతి పీటలూ కంచాలు సిద్ధంగా ఉంచింది.

"మీ నాన్నగార్ని పిలువ్. భోంచేద్దాం."

ప్రభావతి పిలవగానే రంగనాథంగారు భోజనానికి వచ్చేరు.

"ఇంతాలస్యమైందేం!" భార్యవంక చూస్తూ అడిగేరు రంగనాథంగారు.

"రంగమ్మగారు ఎంతసేపటికీ కదలనీయలేదే. ఆ కబుర్లూ యీ కబుర్లూ చెప్తూ ఆలస్యం చేసేరు."

"వాళ్ళంతా క్షేమమేనా!"

"ఆహాఁ..."

"కొంచెం కూర వెయ్యి..."

పార్వతమ్మగారు కూరవేస్తూ "రంగమ్మగారబ్బాయొచ్చాడుట!" అన్నారు.

"ఎప్పుడు!"

"ఉదయం వచ్చేడుట."

"నీ కక్కనపడలేదూ!"

"లేదు. దేశదేశాలూ తిరిగొచ్చాడు. చూద్దామనే ఉన్నాను. కాని ఎంతసేపటికీ రాలేదు.

"ఇంకేమిటి కబుర్లు... !"

"రాజాకి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారట !"

"చదువు పూర్తైంది. నేడో రేపో ఉద్యోగంలో చేరతాడు. ఇక పెళ్లికూడా చేసేస్తే రంగమ్మకు బరువు తీరుతుంది"

"కాని రాజా తల్లి తెచ్చిన సంబంధాలేమీ ఒప్పుకోలేదట"

"ఏం !"

"అతను విదేశంలో చదువుకుని వచ్చాడుగా ! చదువుకున్న అమ్మాయినితప్ప చేసుకోడట ! అమ్మాయి చదువుకున్నదై అందంగావుంటే కట్నం అట్టే యివ్వలేకపోయినా ఫరవాలేదుట. కాని చిక్కేక్కడుందంటే - అందంగా వుంటే చదువులేదు - చదువుంటే అందంలేదు. అని తోసిపుచ్చాడట ఇంతవరకూ."

"నిజమే !...రాజా అలా కోరుకోడంలో తప్పేముంది! తన చదువుకీ అందానికి తగినట్లుగా ఉండొద్దా కాబోయే భార్య!"

"రేపు మీరొకసారి రంగమ్మగార్ని సత్యన్నారాణగార్ని చూసిరాకూడదూ !"

"ఎందుకూ!"

"మన ప్రభావతిని చూసుకొందురు రమ్మని పిలవండి. రాజాకు నచ్చుతుందేమో!"

రంగనాథంగారు కొద్దిక్షణాలు కన్నార్పకుండా పార్వతమ్మ వంక చూసేరు.

ఆ చూపు భరించలేక "ఏం, నే నన్నదాన్లో తప్పేముంది!" అంటూ ముఖం దించుకున్నారావిడ.

ప్రభావతి భోజనంపూర్తి కావడమూ - అక్కణ్ణుంచి వెళ్ళడమూ రెండు జరిగిపోయాయ్ రంగనాథంగారు సమాధానం చెప్పేంతలో.

"సరేలే. ఆలోచిద్దాం"

చెయ్యి కడుక్కుని పెరట్లో మంచం వాల్చుకున్నారాయన.

పార్వతి ఆలోచన అసమంజసం కాదు. రాజా విదేశాల్లో చదివి వచ్చాడు. మనిషి బాగుంటాడు. అతనికోసం ఎందరో ఆడపిల్లల తండ్రులు వేలకొద్దీ గుమ్మరించ గలరు. కాని రాజా తను చేసుకోబోయే పిల్లకి కొన్ని అర్హతలుండా లన్నాడు. ప్రభ అందంగా ఉంటుంది. స్కూలుఫైనల్ పాసయింది. రాజా బహుశా యిష్టపడవచ్చు. కాని ... విదేశాల్లో చదివివచ్చిన అల్లుడు- తనని లెక్క చేస్తాడా!

నాగరికతావ్యామోహంలో ముసిలాళ్ళని తననీ పార్వతినీ కూతురినుంచి దూరం చేస్తే...

ఛ ఛ! తనెందుకిలాఅనుకుంటున్నాడు. ఆడపిల్ల పెళ్ళయ్యాక అత్తవారింటికే పోతుంది. ఆమె సుఖపడటమే కోరుకోవాలిగాని ఆమెను తరచూ చూడటం వీలౌతుందా కాదా అని ఆలోచించడమేమిటి!

రంగనాథంగారి చుట్ట కొడిగట్టి ఆరిపోయింది.

అప్పుడే పార్వతమ్మగారు వక్క-పలుకు నోట్లోవేసు కుంటూ మంచం వాల్చుకున్నారు.

ప్రభావతి వంటిల్లు సర్దుతూంది.

“చూడు పార్వతీ!... నువ్వనుకున్నట్లు ప్రభావతిని రాజా పెళ్ళిచేసుకున్నాడు. అతనికి దూరంగా ఎక్కడో ఉద్యోగ మౌతుంది. కోలెడంత డబ్బూ- చాకిరీ చేసేందుకు సేవకులూ- అన్నీ ఉంటాయ్. అమ్మాయి అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూంటుంది. మనం అమ్మాయిని చూడ టానికే మాత్రమూ వీలుపడదు...

ఇలా జరుగుతుందనుకుందాం. ప్రభావతిని రాజా కివ్వడం మంచిదే అంటావా!”

పార్వతమ్మగారు చిరునవ్వు నవ్వుకున్నారు. భ మరీ యింత అమాయకంగా ఆలోచిస్తారని ఏనాడూ అనుకో లేదామె. ఆయనకంటే తనే తెలివిగా ఆలోచించగలదను కోవడం- ఆమెకు కించిత్ ఆనంద కారణమైంది.

"పెళ్ళంటూ జరిగాక ప్రభ మనదెలాగూ కాదు. దాని మానాన అది సుఖపడితే అంతకంటే మనకేంకావాలి! అయినా మీరన్నీ విచిత్రంగా ఆలోచిస్తారేం!... మీకు గుర్తుందా, ప్రభావతి పుట్టేక చాలాకాలం వరకూ మనం..." మధురస్మృతులేవో గుర్తుకొచ్చి సిగ్గుపడుతూ ఆగిపోయా రావిడ.

రంగనాథంగారు కూడా ఒక్కసారి గతం గుర్తు కు తెచ్చుకుని "మనం అబ్బాయి కావాలని కలలు కన్నాం కదూ!" అన్నారు నవ్వుతూ.

ఆ దంపతులిద్దరూ ఒకరినొకరు మోసం చేసుకుంటూ మనసులో లేని ఆనందం మాటల్లో ఒలకబోస్తున్నారే తప్ప నిజానికి తమకొక కుమారరత్నం లేడన్నవిచారం ఇద్దర్నీ బాధిస్తూనేఉంది.

"మనకొక అబ్బాయి పుడతాడనే అనుకున్నాం... కాని..."

"అందుకే మనం ప్రభ పెళ్ళిగురించి జాగ్రత్తగా ఆలోచించాలి. కొడుకైనా కూతురైనా మనకున్నది ప్రభ ఒక్కతే. పార్వతీ రాజావిషయం అలా ఉంచు. ఈ మధ్య మరో సంబంధంగురించి విన్నాను. చెప్పేదా!"

"చెప్పండి."

"అబ్బాయి అందంగానే ఉంటాడు. చాలా మంచి వాడు. చేస్తున్న ఉద్యోగం మాత్రం సామాన్యమైంది.

ప్రభ నతనికివ్వడమే తటస్థిస్తే అతను మనమాట వింటాడు. ప్రభ మనతోటే ఉంటుంది..."

"ఆస్థీ పాస్తీ ఏమీ లేవా వాళ్ళకి."

"లేవనే అనుకోవాలి."

"ఏమీ లేనివాడికిస్తే అమ్మాయేం సుఖపడుతుంది!"

"ఏమీ లేక పోడమేం, అందముంది. చదువుంది.. అన్నిటికీమించి మంచితనముంది. ఇక ఆస్థంటావా, మన కున్నది చాలదూ! ఇదంతా వారికే చెందుతుందిగా!"

"ఏమో, నాకీసంబంధం అట్టే యిష్టంలేదు..."

"సరేలే... అమ్మాయినే అడుగుతాను. నువ్వేదాని ముందుగా నోరుజారకు." హెచ్చరించారు రంగనాథంగారు.

"అలాగే..."

ప్రభావతి చెంబుతో మంచినీళ్ళు తెచ్చి తండ్రి మంచంవద్ద పెట్టింది.

"నువ్వూ మంచంవాల్చుకో తల్లీ!" అన్నారు రంగ నాథంగారు.

"అలాగే నాన్నా. ఇంకా నిద్రరావడంలేదు. కాసేపు చదువుకుని పడుకుంటాను."

రంగనాథంగారికి కూతురి సమాధానం అపరిమితమైన ఆనందాన్నిచ్చింది. ఏ పరీక్షలకు వెళ్ళే అవసరం లేకపోయినా

ప్రభావతి ఏవో పుస్తకాలు తెప్పించుకుని చదువుకుంటూనే వుంది. అటు చదువు- ఇటు వంటపని- నిజంగా ప్రభ చాలా తెలివైనది! ఆ తెలివితేటలే లేకపోతే తల్లి చేసే గారా బానికి మొద్దుఘటం అయ్యుండేది.

వేపచెట్టుమీంచి చల్లగాలి వస్తుంది... దానికితోడు చల్లని వెన్నెల. కొద్దిసేపటికే దంపతులిద్దరూ నిద్రాదేవి వడిలోకి జారుకున్నారు. గదిలో దీపం వెలుగుతూనే వుంది.

టేబుల్ ముందు కూర్చుని గంభీరంగా ఆలోచిస్తోంది ప్రభావతి.

తనకొక పెళ్ళిసంబంధం చూడబోతున్నారు !... ఈ విషయమే ఆమె నపరిమితంగా వేధిస్తోంది.

ఆమె మధుమూర్తి నభిమానించింది. ఆరాధించింది.. అతనితో జీవితం గడపాలని కలలుకంది. ఆ వయస్సులో అది సహజమే. కాని ఆమె ఆశలన్నీ అడియాసలై కలలన్నీ కల్లలు కాబోయే సమయంలో గంత్యంతరమేమిటా అని అన్వేషిస్తోంది.

* * * *

తెల్లవారింది.

రంగనాథంగారు పేపరు చదువుతూ వరండాలో కూర్చున్నారు.

మధుమూర్తి బట్టలు వేసుకుని హోటల్‌కి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు.

"మామయ్యా!"

పేపరు పక్కన బెట్టి కళ్ళజోడు సవరించుకుని చూసే రాయన.

"నువ్వటోయ్ రాజా! ఎంత మారిపోయావ్! ... రా కూర్చో... ప్రభా! రాజా వచ్చాడని మీ అమ్మకు చెప్పు..."

రాజా కుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్ కాల్చుకో సాగేడు.

"ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నావా రాజా!"

"చేస్తున్నాను మామయ్యా!... నేడో రేపో పోస్టింగ్ వస్తుంది."

"ఎందులో!"

"ప్రైవేట్ ఫరమ్‌లో చేరుతున్నాను. జీతం వెయ్యి దాటుతుందిలే"

కాఫీ కప్పులు తెస్తున్న పార్వతమ్మగారి కళ్ళు ఆనందంగా మెరిసేయ్.

"ఖులాసాగా ఉన్నావా అత్తయ్యా!" కాఫీ కప్పు అందుకుంటూ అడిగేడు.

"మా ఖులాసాకేం బాబూ!... బాగానే ఉన్నాం"

"ప్రభావతేదీ!" సిగరెట్ పీలుస్తూ అడిగేడు రాజా.

"వస్తుంది బాబూ! ఆడపిల్లకదూ, మొగవాళ్ళ ఎదుటికి రావడమంటే సిగ్గు. జడేసుకుంటూంది. రెండు నిముషాల్లో వస్తుంది."

ముగ్గురూ లోకాభిరామాయణంలోకి దిగేరు.

మధుమూర్తి గదికి తాళం వేసి బయల్దేరేడు.

"ఇతనెవరు మామయ్యా!"

"ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాడు. పేరు మధుమూర్తి."

వరండాలో అడుగుపెట్టిన ప్రభావతి ద్వారం దగ్గరే ఆగిపోయింది.

"బాగున్నావా ప్రభావతీ! అయిదేళ్ళ క్రితం - నా చేత మొట్టికాయలుతిన్న పసిపిల్లవి - ఇప్పుడు చాలా పెద్దదానివై పోయావ్!" నవ్వేడు రాజా. ప్రభావతికతని నవ్వు వింటూంటే ముళ్ళమీద నిలుచునట్లుంది.

చేతిలో సిగరెట్ - ఎదుటివాళ్ళేమనుకుంటారో అనేనా* ఆలోచించకుండా తొందరపడి మాట్లాడ్డం -

రాజా ఎంత చదువుకుంటే మాత్రం మధుమూర్తి వంటి సంస్కారవంతుడు కాగలడా! అనుకుంది ప్రభావతి.

"ఎంతవరకూ చదువుకున్నావ్!"

'స్కూలు ఫైనల్..." అయిష్టంగానే బదులు చెప్పిందామె.

విదేశాలకు వెళ్ళొస్తే శాస్త్ర వెజ్జీకూడా వెనక తెచ్చుకుంటారు కాబోలనిపించింది రాజాను పరికిస్తున్న రంగనాథం గారికి.

"కాలేజీలో చేరలేదేం!"

ఈ సారి ప్రభావతికి పళ్ళుమండింది. అయినా సాధ్యమైనంతవరకూ నిగ్రహించుకుని "ఆ ప్రశ్న అడగాల్సింది నన్నుగాదు నాన్నగార్ని." అంటు లోపలకు వెళ్ళిపోయింది.

"బొత్తిగా పెంకిదైపోయింది!" నవ్వుకున్నాడు రాజా.

రంగనాథంగారూ, పార్వతమ్మగారూ అతన్నేవో అడుగుతుంటే అత పతిశ్రద్ధగా సమాధానాలివ్వసాగేడు.

ప్రభావతి అతని కనులకి చాలా అందంగా కనిపించింది. సన్నగా పొడవుగా... మెరుపు తీగెలా ఉందామె. ఆమె గిరుక్కున తిరిగి వెళ్తున్నప్పుడు ఆమె పొడవైన జడ కాటేసేందు కొచ్చిన పాము పడగలా ముందుకురికింది.

రాజా ఆమెను దొరసాని దుస్తుల్లో ఊహించ సాగేడు.

స్థూలమైన శరీరం- గౌనులో చాలా బాగుంటుంది. పచ్చనిరంగు కనక ఆమె దొరసానిలాగే ఉంటుంది. ఎటొచ్చీ కష్టమల్లా ఆ జడతోనే. దానికేముంది. కత్తిరిస్తే పోదూ!

బాబ్డ్ హెయిర్–హైహీల్డు షూస్–గౌను వీటితో ప్రభావతి తన పక్కన నిల్చున్నట్లు ఊహించుకుంటూ ఆనందించ సాగేడు రాజా!

కొంత సేపయ్యాక రాజా తనింటికి బయల్దేరేడు.

అతని ప్రవర్తన రంగనాథం గారికి ఎబ్బెట్టుగానే అనిపించింది. సిగరెట్ కాల్చడం నేరంకాదు. కానీ అదేదో మహత్తరమైన విద్యలా పెద్దవాళ్ళ ఎదుటే వెలిగించటమెందుకు!

పార్వతమ్మగారి కిటువంటి స్వల్పవిషయాలను గమనించడానికే అవకాశం లేకపోయింది. నెలకు వెయ్యి రూపాయల జీతం!... ఆమె కళ్ళముందు ప్రభావతి మహారాణిలా ఒక భవనంలో ఉంటూ, దాసదాసీల నాజ్ఞాపిస్తున్నట్లే అనిపించింది.

ఆ సాయంత్రంవరకూ రాజా కబుర్లతో భర్త ప్రాణాలు తీసి వదిలిపెట్టారావిడ. ప్రభావతి మాత్రం పుస్తకం నెపంతో తన గదిలో ఒంటరిగా గడిపింది.

సాయంత్రం ఐదున్నర అయింది, ప్రభావతి స్నానం చేసి మల్లెపువ్వులాటి తెల్లచీర కట్టుకుని నల్ల జాకెట్టు వేసుకుంది. తలలో సంపెంగలు పెట్టుకుని చల్లగాలికి డాబా మీదకు వెళ్ళింది.

ఆమె దృష్టంతా రోడ్డువంకే ఉంది. అప్పుడప్పుడు కొద్దిమంది రాకపోకలు సాగిస్తున్నా వారిని గమనించకుండా మలుపువద్దే దృష్టి నిలిపిందామె.

మధుమూర్తి మలుపు తిరిగేడు!... అతను వస్తున్నాడు...

సరిగ్గా ఇంటిముందుకొచ్చి ఒక్కసారి పైకిచూసేడు. ప్రభావతి! ప్రభావతి ఎంత అందంగా ఉంది! అనుకున్నాడతను. కాని మరుక్షణంలోనే తనను తనే మనసులో నిందించుకున్నాడు.

తన పరిస్థితేమిటి! తన ఆలోచనలేమిటి! తనెందుకిలా మారిపోతున్నాడు!

రూము తెరిచి పెన్ను టేబుల్ మీద పెట్టేడు. కిటికీలో ఏదో కవరుపడుంది. ఆత్రుతగా అందుకున్నాడు.

ఎడ్రస్ లేదు... పోస్టల్ స్టాంపులులేవు. ఉన్నదల్లా తన పేరొక్కటే. త్వరత్వరగా కవరుచింపి చదవసాగేడు.

దైవనిర్ణయం

మధుమూర్తిగారూ!

నేను చేస్తున్నది ఒక విధంగా సాహసమే వుతుంది. ఒక స్త్రీ పర పురుషుడికి ఉత్తరం రాయడం - అపరాధమే. కాని పరిస్థితులలో తప్పనిసరై ఈ ఉత్తరం రాస్తున్నాను. క్షమించండి.

మిమ్మల్ని చాలాకాలం నుంచీ చూస్తున్నాను. మీరంటే నాకొక విధమైన అభిమానముంది. ఈ అభిమానాన్ని మీరెలా ఊహించినాసరే. మీ రూపం - మీ గంభీరతా నన్ను విశేషంగా ఆకర్షించాయ్. మిమ్మల్ని చాలాకాలంగా హృదయంలో ఆరాధిస్తున్నాను.

కాబోయే జీవిత సహచరుని గురించి కలలు కనడం. కన్యకు సహజమే అనుకుంటాను. ఇంతకాలమూ సిగ్గో, సంకోచమో ఏదో అడ్డునిలిచి నా ఉద్దేశాలను మీకు బహిర్గతం చేయలేక పోయాను. కాని యీనాడు తొందరపడకపోతే మీరు నాకు దక్కరేమో అనిపించింది. ఉదయం మా బావ రాజా వచ్చేడు. మీరు చూసేవుంటారు. విదేశాలలో చదివివచ్చాడు. పెద్ద ఉద్యోగంలో చేరబోతున్నాడు. అతనికి నన్నివ్వాలని మా వాళ్ళనుకుంటున్నారు. ప్రజల దృష్టిలో రాజా గొప్పవాడే కావొచ్చు. కాని నేను కోరుకునే సంస్కారం - గంభీరత్వం - అతనిలో లేవు. అతని గొప్పతనాన్నంగీకరించగలనేమో కాని అతన్నారాధించలేను.

నాన్నగారికి మీరంటే చక్కని అభిప్రాయముంది. మీరంగీకరిస్తే ఆయన నన్ను రాజా కిచ్చే ప్రయత్నం విరమించుకుంటారని నా నమ్మకం.

నిన్న సినిమాలో మీరు... వద్దులెండి. అది అప్రస్తుతం. చదువుకున్న చదువో, నాన్న యిచ్చిన స్వాతంత్రమో, మీరు దూరమౌతారన్న భయమో - ఏమైతేనేం ఏదో అదృశ్యశక్తి నాచేత ఈ లేఖ రాయించింది. ఎంత ప్రయత్నించినా ఇంతకంటె వివరంగా, స్పష్టంగా రాయలేకపోయాను.

నన్ను మన్నించి వెంటనే సమాధానమిస్తారు కదూ!

ఇట్లు
ప్రభావతి.

మధుమూర్తి తనను తానే నమ్మలేకపోయాడు.

ప్రభావతి ఉత్తరం రాసింది. మామూలు ఉత్తరం కాదు ప్రేమలేఖ! ఏమిటిది! తనను ప్రభావతి ప్రేమిస్తోందా! తనలో ఏముందని ప్రేమిస్తోంది!

తను గంభీరుడట! ... నలుగురిలోనూ సరదాగా మాట్లాడలేక పోవడమూ - చిరునవ్వు నవ్వడానికే భయపడటమూ - ఇదా గంభీరత్వం! తనను ప్రేమించడంలో - తనకు ఉత్తరం రాయడంలో ప్రభావతి పొరపాటే చేసింది. కాదు... ఆమె పొరపాటు చెయ్యలేదు.

విద్యావంతురాలు... ధైర్యస్థురాలు. తన మనసులో ఏముందీ బయటకు చెప్పుకోగల ధీరురాలు. ఆమె తప్పు చేయదు.

కాని...తను ఆమె ప్రేమను స్వీకరించడానికి కర్హుడు కాదు. తిరస్కరించ గలిగే శక్తి లేదు. తను పట్టి దుర దృష్టవంతుడు.

మధుమూర్తికి ఒక్కసారి విశాలాక్షి గుర్తొచ్చి గజగజ వణికిపోయాడు.

చేతిలో ఉత్తరంతో అలాగే కూర్చుండిపోయాడు మధుమూర్తి.

ప్రభావతికి సమాధానం రాయాలా! ఏమని!

"ఏమిటయ్యా ఆ ఉత్తరం!" రంగనాధంగారతని రూములో అడుగుపెడుతూనే అడిగేరు.

"ఏమీ లేదు" అపరాధిలా ఉత్తరం ముడచి "పార్కుకి వెళ్ళలేదా! అంటూ ప్రశ్నించాడు మధుమూర్తి.

"లేదయ్యా!...ఇవాళ పేపరుచూసేవా!" అంటూ పేపరిచ్చి వెంటనే వెళ్ళిపోయారాయన.

ప్రభావతి రాసిన ఉత్తరం - రంగనాధంగారికిస్తే పర్యవసానం ఎలా ఉంటుంది! కూతురిమీద కోపగిస్తారా!... ఉహుఁ... అలా చెయ్యరు. ఆయనకు మనుషుల మనస్త

త్వాలు బాగా తెలుసు. అవసరమైతే మృదువుగా మందలిస్తారంతే.

పోనీ తన కథంతా ప్రభావతికిరాస్తే ... వద్దు వద్దు తనలా చెయ్యలేదు. తన జీవితం ఇతరులకి చెప్పుకుని వారు చూపే సానుభూతికి తట్టుకో గలగడం తనకు అసాధ్యం.

ఆ రాత్రి భారంగా గడిచింది మధుమూర్తికీ ప్రభావతికీ.

పంచాయతీ
వేమన గ్రంథాలయం,
తేలప్రోలు :: కృష్ణా జిల్లా,

4

రెండు రోజులు గడిచాయ్... మధుమూర్తి సమాధానం కోసం ఎదురుచూసి విసిగిపోయింది ప్రభావతి.

అత నెందుకంత స్తబ్ధంగా ఉంటాడు! ఆడపిల్లగా తను చేయరాని సాహసము చేసింది. కాని అతను మగవాడై కూడా సమాధానం రాయటలేదు. అతను తనని ప్రేమించడం లేదా! ప్రేమించకపోయినా కనీసం తనను చేసుకుందు కిష్టమేనా లేదా!

మధుమూర్తి తను కున్నంత అమాయకుడు కాదేమో!... బాహ్యప్రవర్తనను బట్టి తనతన్ని అంచనా వేసింది. కాని అతని ఆంతర్యం ఏటువంటిదో తన కెలా తెలుస్తుంది!

ఒకనాడెవరో స్త్రీని తీసుకొచ్చాడంటే తను నమ్మే లేదు. కాని తన కళ్ళతోనే స్వయంగా అతనూ మరో స్త్రీ మాటలాడుకుంటూంటే చూసింది. ఆమె ఎవరో ధనవంతు రాలిలా ఉంది. అందంగాకూడా... మధుమూర్తికీ ఆమెకూ ఏమిటి సంబంధం!

ఇద్దరూ ప్రేమించుకుంటున్నారేమో! అందుకే మధుమూర్తి తనపట్ల నిర్లిప్తంగా ఉదాసీనంగా ఉంటున్నాడేమో!

ఏదో ఒక విషయం అతనెందుకు రాయడు! అహం కారమా? ఛ ఛ!... అతనటువంటివాడు కాదు. నిజం తెలియక తనే అపోహ పడుతూంది.

రోజులు గడుస్తున్నా అతని సమాధానం కోసం ఎదురు చూస్తూనే ఉంది ప్రభావతి.

ఆమెకేం సమాధానం రాయాలో అర్థంకాక మధుమూర్తి ఆవిషయాన్ని వాయిదా వేసేడు.

ఆ రోజు... ఆఫీసు కాగానే మధుమూర్తి బయటకు వచ్చేడు. అప్పటికే బస్సు వెళ్ళిపోయింది. రూముకి వెళ్ళా లంటే బస్సూ- తప్పితే నడకా అంతే తప్ప రిక్షా ఎక్కడం అలవాటు లేదతనికి.

విశాఖపట్నంలో రిక్షాలో వెళ్ళడం కొంచం చిత్రంగా ఉంటుంది.

కొండమీద పెరిగిన ఊరవడంవల్ల ఎక్కడచూసినా రోడ్డు సాఫీగా ఉండదు. అయితే పర్వతమెక్కుతున్నట్లు ఎత్తు లేకపోతే పాతాళంలోకి జారుతున్నట్లు డౌను. రిక్షాలో కూర్చుని ఎగుడులో రిక్షావాడు పడేబాధను చూడటం ఎంత కష్టమో, డౌనులో అతి వేగంగా వెళ్లే రిక్షాలో ప్రాణం బిగబట్టుకుని కూర్చోడమూ అంతకష్టమే.

ఆఫీసు రోడ్డుదాటి వందగజాలు వచ్చేడు. సాధారణంగా అతనెప్పుడూ ఏదో ఆలోచిస్తూనే ఉంటాడు. ఆ పరధ్యానాన్నే కొందరు గంభీరత్వమనీ, పిచ్చనీ భావిస్తూంటారు.

"మధుమూర్తిగారూ !"

తుళ్లిపడి చూసేడతను. శారద !

"రండి. యింటికివెళ్దాం..." పక్కగా కారాపి ఆహ్వానించింది శారద. మధుమూర్తి ప్రమాదంలో చిక్కుకున్నట్లు కంగారుగా చూసేడు.

వెనుక తన ఆఫీసువాళ్లు వస్తున్నారు. వాళ్ళుచూస్తే..

"త్వరగా రండి. ప్లీజ్ !"

అతను కారులో కూర్చున్నాడు. కారు కదిలింది.

ఆఫీసువాళ్లతనామె కారులో ఎక్కడం చూడనే చూసేరు. వాళ్ళెదురౌతుంటే మధుమూర్తి తల దించు

కున్నాడు. దానితో వారి అనుమానాలకి మరింత ఆస్కారం దొరికింది.

"సమయానికి కనిపించారు ... అన్నయ్య క్యాంప్ వెళ్లేడు. ఇంట్లో ఏమీ తోచక ... కారేసుకుని బయల్దేరేను. వస్తూంటే మీరు కనిపించారు. నేను చాలా అదృష్టవంతురాలిని. ఇదేనా మీ ఆఫీసు!"

"ఊఁ ..."

"గుడ్!... అయితే మాయింటికి దగ్గరేనన్నమాట. చెప్పేరు కారే!"

"... ..."

ఆ ఆదివారం తర్వాత మరో ఆదివారం వెళ్ళింది. ఒక్కసారి రాలేదేం మీరు! మామీద కోపం వచ్చిందా! లేక రాకూడదనుకున్నారా!"

"అబ్బే ... అటువంటిదేమీ లేదు." నీళ్ళు నమిలేడు మధుమూర్తి.

కారు గేరేజ్‌లో పెట్టివచ్చింది శారద !...

"వచ్చారా అమ్మగారూ!... మీకోసం ఎంత భయపడ్డానను కున్నారు!"

"ఎందుకూ! రాకేమైపోతాననుకున్నావ్!

ఐనా నా రాకపోకలకి నీ పర్మిషనడగాల వేమిటి!"

దాసీ ముఖం చిన్నబుచ్చుకుని నిలుచుంది.

"ఏందుకలా నిల్చుంటావ్. అతిథులొస్తే ఏం చెయ్యాలో అర్థంకాదూ! వీరిని బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళు..." గర్జించింది శారద.

మధుమూర్తి ప్రాన్పడి పోయాడు. శారద!... అతిసౌమ్యురాలూ... సంస్కారవంతురాలూ – ఆ మేనా ఇలా ప్రవర్తిస్తూంది!

"రండిబాబూ..." దాసీ పిలిచింది.

మధుమూర్తి ఆమెవెంట నడవసాగేడు.

"ఏమీ అనుకోకండి బాబూ!... అమ్మగారికి మనసు సరిగ్గాలేదు అందుకే కసురుకుంటున్నారు. గంట క్రితం కారేసుకు వెళ్తూన్న అమ్మాగారిని ఆపాలనుకున్నాను. కాని అప్పుడూ యిలాగే నామీద విరుచుకుపడి వెళ్ళిపోయారు బాబూ!... తమరు వీరి బంధువులా?" ఆమె ప్రశ్నకు సమాధానం యివ్వకుండా "ఇలా తరచుగా మనసు చెదురుతూంటుందా?" అంటూ అడుగేడు మధుమూర్తి.

"నెలకూ రెండునెలలకూ వస్తుంది బాబూ... ఇప్పుడు చాలా నయం. కిందటిసారి ఇంట్లో నేనుకూడా లేని సమయంలో నడచి వెళ్ళిపోయారు. ఎక్కడెక్కడో తిరిగి మర్నాడు తెల్లవారుతూంటే వచ్చారు. మామూలు వేళల్లో మహా మంచిమనిషి. కాని మనసు

చదిరితే పట్టడం మనుషుల వశంకాదు. బాబూ! అమ్మ గారితో తమరు కొంచం జాగ్రత్తగా..."

"అలాగే... నీ పేరు?"

"కన్నమ్మ బాబూ!"

"ఆమె ఎందుకిలా అయిందో తెలుసా!"

"ఏమో బాబూ! అంతా ఆ దేవుడిలీల!"

కన్నమ్మ బాత్ రూములో సబ్బు... తువ్వాలూ అన్నీ సిద్ధంచేసి వెళ్ళిపోయింది.

ముఖం కడుక్కొని బయటకొచ్చేసరికి శారదే ఎదురుగా వచ్చింది. "మేడమీద కూర్చుందామా!"

"పదండి..."

అక్కడ బల్లమీద ఫలహారాలు సిద్ధంగా ఉన్నాయ్. ఎదురుగా ఒక వ్యక్తి ఉన్నాడన్న విషయమే మరచినట్లు తినడంలో మునిగిపోయింది శారద

మతి చలిస్తే.. ఆకలికూడా ఎక్కువౌతుందేమో అనుకున్నాడు మధుమూర్తి ఆమెవంక చూస్తూ.

డ్రింక్‌కూడా - ఆమె రెండు గ్లాసులు పుచ్చుకుంది.

"అలా బాల్కనీలో కూర్చుందాం పదండి..."

కీలు బొమ్మలా అనుసరించేడు మధుమూర్తి.

"నేను కారు బాగా డ్రైవ్ చేస్తానుకదూ! కాని స్టేబుల్ అదిరిపోయాడు మార్కెట్ దగ్గర నా స్పీడ్ చూసి." గలగల నవ్వింది శారద.

మధుమూర్తి మస్తిష్కంలో మెరుపులా దూసుకు పోయిందొక భయంకరమైన సంశయం.

తాము చాలా వేగంగా వచ్చేరు కారులో. శారదకు మతిస్థిమితంలేని క్షణాల్లో అలా శరవేగంతో వెళ్తే... ఏదేనా యాక్సిడెంటు... ఆలోచించలేక పోయాడు మధుమూర్తి.

"మధూ! మీకు పాటలంటే యిష్టమేనా!"

"ఊఁ..."

శారద త్వరత్వరగా పక్కగదిలోంచి వీణ తెచ్చింది. కొద్ది క్షణాల్లో ఆమె వాయించడం ప్రారంభించింది.

అది సంగీతం కాదు. ఒక విధమైన ఉద్వేగం. వడిగా పడుతున్న జలపాతంలా - కెరటాలతో కల్లోలంగా ఉన్న సముద్రంలా - వాయిద్యం వినేవారి హృదయంలో అలజడి కలిగిస్తుంది.

కొన్ని నిముషాలలాగే గడచి పోయాయ్. ఉన్నట్లుండి సంగీతం తారస్థాయి నందుకుని ఒక్కసారి ఆగి పోయింది.

వీణతీగె తెలిపోయింది. సంగీతం బదులు నిశ్శబ్దం ఆవరించింది.

శారద వీణమీద వాలిపోయింది !

కన్నమ్మ వడివడిగా పరుగెత్తుకొచ్చింది. మధుమూర్తి ఆమె కలిసి మెల్లగా శారదను మంచంపై పరుండ జేసేరు.

శారద ముఖంలో అలసట స్పష్టమౌతూంది. చెమటతో తడిసిన కుంకుమ ముఖమంతా అలుముకుంది.

ఎన్నో యుగాలుగా విశ్రాంతి దొరకనట్లు- శారద ఒక విధమైన సుషుప్తిలో మునిగి పోయింది. నిదుర పోతున్న శారద ప్రాపంచికానుభూతులన్నిటినీ త్యజించి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటున్నట్లుంది.

మధుమూర్తి నిర్నిమేషంగా ఆమెవంక చూడ సాగేడు. అతని కనులలో ఏ భావమూ ప్రస్ఫుటించడం లేదు.

"ఇలా ఎంతసేపుంటారు !" అడిగేడతను కన్నమ్మ వంకచూసి.

" చెప్పలేం బాబూ. పనుంటే మీరు వెళ్ళండి. అమ్మగారేరాత్రో లేస్తారు."

మధుమూర్తికి శారద నాపరిస్థితిలో వదలి వెళ్ళడానికి మనస్కరించలేదు. అతనలాగే నిల్చునాడు.

గేటుదగ్గర చప్పుడైతే కన్నతుమ్మ దిగివెళ్ళింది. కొద్ది నిముషాల్లో ప్రసాదరావ్ వచ్చేడు.

"గుడ్ మార్నింగ్ మధుమూర్తి!"

"గుడ్ మార్నింగ్."

"అరె! శారద!... ఫిట్ వచ్చిందా!"

"ఊఁ..." జరిగినది క్లుప్తంగా చెప్పేడు మధుమూర్తి.

"ప్రసాదరావ్‌గారూ!... వీలైనంతవరకూ శారదను ఆమె కందుబాటులో లేకుండాచేస్తే మంచిది. ఎందుకంటే ఆమె నడిపే వేగంలో..."

"ఆ విషయం నేనూ ఆలోచించాను. కాని శారద వినలేదు. అంత ప్రమాదమే జరిగితే తనకు మరీమంచిదంది"

"మీరు మందలించి ఉండవలసింది..."

"నాకున్నదల్లా శారద!...ఆమెను మందలించడం–క్షమించండి మూర్తి!... నాకు సాధ్యం కాలేదు."

"ప్రసాదరావ్‌గారూ!... చిన్న విషయం అడుగుతాను. ఏమీ అనుకోరుకదూ!"

"అడగండి."

"శారద ఎందుకిలా అయింది!"

ఒక్కసారి ప్రసాదరావ్ ముఖంలో విషాదం అలుము కుంది.

"చెప్తానుమూర్తి !...కొంచెం కాఫీ తాగుదాం..."

ఇద్దరికీ కన్నమ్మ కాఫీ యిచ్చింది.

"ఇది మాకు సంబంధించిన కథ !... దీనిని నేనే చెప్పవలసి రావడం - చాలా బాధపడుతున్నాను... అందుకే మా పేర్లతోనే వ్యవహరిస్తాను."

మధుమూర్తి ఆశ్చర్యంగా చూసేడు.

ప్రసాదరావ్ కథ ప్రారంభించాడు.

శారద కలవారియింట్లో జన్మించింది. ఆమెకు ఒక్క అన్నయ్య మినహా అక్కచెల్లెళ్లెవరూ లేరు.

శారదకు ఎనిమిదేళ్ళు వచ్చేసరికి అమ్మా నాన్న గారూ పట్టుబట్టి వివాహంచేసేరు. ఆ కుటుంబాలలో అంత వరకూ బాల్య వివాహాలుచేయడమే అలవాటు.

శారద వివాహమయ్యేటప్పటికి అన్నయ్యకు పధ్నా లుగేళ్ళు. పల్లెటూళ్లో స్కూలు లేకపోవడాన బాబాయ్ దగ్గరుండి చదువుకునేవాడు.

శారద వివాహమై సంవత్సరం గడిచేసరికి... ఒక నాడు తల్లీతండ్రీ వస్తున్న బండికి ప్రమాదం సంభవించి

ఇద్దరూ తీవ్రంగా గాయపడి మంచమెక్కారు. ఎన్ని చికిత్సలు చేసినా వారు కోలుకోలేదు.

కొద్దిరోజుల తేడాలో ఇద్దరూ మరణించారు.

అక్కడున్న ఆస్తినంతా అమ్మి ఆ డబ్బు బ్యాంకులో వేసి శారదను కాకినాడ తీసుకొచ్చేడు బాబయ్య.

కాలగర్భంలో అనేక సంవత్సరాలు కలిసి పోయాయ్.

శారదకు పద్దెనిమిది సంవత్సరాలు నిండేయ్. పోత పోసిన బంగారు విగ్రహంలా అత్యంత సుందరంగా ఉండేది శారద. అన్నయ్య ఇంజనీరింగ్ పాసయ్యాడు.

బాబాయ్‌కి భయం! .. తను నేడో రేపో చచ్చి పోతాడని గ్రహించి శారదను భర్తవద్దకు పంపాలని ప్రయత్నించ సాగేడు.

బాబాయ్‌ది ఒక విచిత్ర జీవితం. పిన్ని మహా గయ్యాళి. ఆమె ఉన్నంతకాలమూ ఏమాత్రమూ శాంతి లేదు బాబయ్యకి. ఆమె చనిపోయేటప్పటికే బాబాయ్‌కి నలభై ఐదేళ్ళు. నాలుగైదు సంవత్సరాలపాటు కోరుకున్న సుఖాలన్నీ విచ్చలవిడిగా అనుభవించి రోగం తెచ్చుకున్నాడు. తనిక అట్టేకాలం బతకడని తెలుసుకోగానే శారదను తీసుకుని పల్లెటూరు బయల్దేరేడు.

ఇన్నాళ్ళూ శారద భర్త అందరికీ దూరంగానే ఉంటు

న్నాడు. అత్తమామలు చనిపోయినప్పుడూ— బాబయ్య శారదను కాకినాడ తీసుకెళ్ళేటప్పుడు తప్ప తరవాత అతను కాకినాడ రావడం గానీ, శారద అక్కడకు వెళ్ళడంగానీ జరగలేదు.

బాబయ్య శారదను పల్లెటూరు తీసుకువెళ్ళగా శారద భర్త గోపాలం అక్కడలేడనీ ఎక్కడో ఆశ్రమం నిర్మించుకుని ఉంటున్నాడనీ తెలిసింది. ఈ వార్త బాబాయ్‌కి తెలిశాక బొత్తిగా డిగజారిపోయాడు.

బాబాయ్‌కి పిల్లలెవరూ లేరు. అందుకే శారదనీ అన్నయ్యనీ తన స్వంత బిడ్డల్లా పెంచేడు.

చివరి రోజుల్లో ఆయన శారద భవిష్యత్తు తలుచుకుని కుమిలిపోసాగేడు.

ఆ రోజు ప్రసాదరావ్ ఉదయం ఎక్కడికో వెళ్ళి సాయంత్రం చీకటి పడుతూంటే తిరిగొచ్చేడు... యింట్లో అడుగు పెట్టేసరికి... శారద వడిలో బాబాయ్ !... శారద నిద్రపోతున్నట్లుంది. దాసీ యిద్దర్నిచూస్తూ మూలగా కూర్చుంది.

"ఏం జరిగింది కన్నమ్మా!" ఆత్రుతగా అడిగేడు ప్రసాదరావ్.

"బాబుగారు..." దుఃఖంతో నోట మాటరాలే దామెకు.

ఆందోళనగా అరుస్తూ బాబాయ్ శరీరంపై బ
పడుస్తూ ఉండిపోయాడు ప్రసాదరావ్.

బాబాయ్ ఇక లేడు ! ... శారదనీ ప్రసాదరావ్‌నీ విడిచి తన మానాన తను వెళ్ళిపోయాడు.

బాబాయ్ మరణం - శారదలో విపరీత పరిణామాలకు దారితీసింది. అంతవరకూ ఆమెకు మృత్యువెంత భయంకరమైనదో తెలియదు. బాబాయ్ చివరిక్షణాలు చూసేసరికామె మనసు వికలమైంది. నిజం చెప్పాలంటే ఆమె తన తండ్రికంటే బాబాయ్‌నే అధికంగా ప్రేమించింది. ఆమెనెంత ఊరడించాలనుకున్నా సాధ్యంకాలేదు ప్రసాదరావ్‌కి.

శారద ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ తనలో తనే ఏదో గొణుక్కుంటూ పిచ్చిదానిలా మారిపోయింది. యూనివర్సిటీలో చేరదల్చుకున్న శారద తన ప్రయత్నం విరమించింది. ఎప్పుడూ ఆలోచిస్తూనే కూర్చునేది. ఇంతలో ప్రసాదరావ్‌కి విశాఖపట్నంలో ఉద్యోగం వచ్చింది.

వాతావరణం మారితే శారద చక్కబడుతుందన్న ఆశతో ఆమెను విశాఖపట్నం తీసుకెళ్ళేడు.

రోజులు గడుస్తున్నాయ్. ఒకరోజు అతనికి చిత్రమైన ఉత్తరం వచ్చింది.

'ప్రసాదరావ్ !

మీరు నాకోసం వచ్చి వెళ్ళేరని తెలిసింది. ఈ నా ఉత్తరం మీకు ఆశ్చర్యమూ విచారమూ కల్గిస్తుందని తెలిసినా ఏనాటికైనా నిజం బయటపెట్టక తప్పదని రాస్తున్నాను.

జీవితమంటే ఏమిటో తెలియని వయసులో నాకు శారదతో వివాహం జరిగింది. నిజానికది వివాహం కాదు. బొమ్మలపెళ్ళి! తరువాత కాలంగడిచి యౌవనంలో అడుగుపెట్టేను.

బాల్యాన్నాధారం చేసుకుని జీవనగమనం ఊహించబోతే పొరపాటౌతుంది.

మనిషి మనసుకంటె చిత్రమైనదేమీ లేదు. అప్పుడు నాకు పధ్నాలుగేళ్లు. తల్లీదండ్రీ ఎవరూ లేని కారణంగా మామయ్య ఇంటివద్ద పెరిగేను. మామయ్య చండ శాసనుడు. అత్తయ్య అతి కోపిష్టి జాలీ ధర్మమూ వంటి పదాలకైనా ఆ యింట్లో తావు లేదు. మమతా మమకారాలు మచ్చుకైనా కానరాని ఆమనుష్యులు పాషాణాలకంటె అధములు. వారి ఆలనలో బతికేను నేను!... అందుకే నేను కూడా మారిపోయాను. రాగద్వేషాలలో నాకు ద్వేషమే మిగిలింది; అక్కడ నేననుభవించిన బాధలు తలుచుకోడాని కూడా భయమేస్తుంది. అంత బండబతుకు బతికేను.

ఆ లేతవయసులో అతి సున్నితమైన నా మనసుకి దెబ్బలు తగిలితగిలి మొద్దుబారిపోయింది. చీకటినే తప్ప వెలుగునీ, ద్వేషమే తప్ప అనురాగాన్నీ సహించలేక పోయే వాణ్ని. మనుషులంటే విపరీతమైన ద్వేషం పెరిగి పో సాగింది.

ఒకనాడు మామయ్యవద్ద కెవరో సాధుపుంగవులు దయచేశారు. ఆ స్వామికి శిష్యులెవరూ లేకపోగా నన్ను ఆయన సేవకై నియోగించేడు.

ఎప్పుడూ ఆయనేదో ఉపదేశిస్తూనే ఉండేవాడు. నేను అపరిమితాశక్తితో వినేవాడిని. స్వామి వాక్కు మృదు మధురంగా ఉండేవి. ఆయన వదనంలో తేజస్సు ప్రజ్వ రిల్లేది. స్వామివారి సమక్షం— నాకు చాలా సంతోషంగా ఉండేది.

స్వామివారి ప్రతి ఉపదేశమూ నాకు తలకెక్కింది. ఆధ్యాత్మిక బోధనలతో నా మనసు మారిపోయింది.

స్వామిగారితో పాటు నేనూ ఆయనవెంట వెళ్ళిపోడం ఎవరికీ తెలియక నేనేదో ఐపోయాననుకున్నారు. ఆయనతో రెండు మూడు సంవత్సరాలు తిరిగి హటాత్తుగా సన్యాసం స్వీకరించేను. ఆ క్షణాల్లో నాకు వివాహమైందన్న విష యమే గుర్తులేదు. ఆనాటినుంచీ నేను ప్రజలకి దూరంగా ఆశ్రమం నిర్మించుకుని కాలం వెళ్లబుచ్చుతున్నాను. నేను చేసినది అపరాధమనీ నన్నెవరూ క్షమించరని తెలుసు.

కాని నామనస్సుని నేనే జయించలేకపోయా నా విచిత్ర ఘడియలలో.

నేను విరాగినైనంత మాత్రాన అందర్నీ అలా నడవమని నేననను. శారద వంటి స్త్రీరత్నానికి నావంటి వాడు భర్తగా తగడు. నేనామెకు చేసిన ద్రోహం - దానికి ప్రాయశ్చిత్తంలేదు. నేను కోరేదల్లా ఒక్కటే. చక్కని వరుని వెదికి శారదకు వివాహం చెయ్యి. జ్ఞానమెరుగని వయసులో చేసే పాపాలెలా అంటవో, అలాగే బాల్యంలో జరిగిన పెళ్ళికూడా శారదకు వర్తించదు. శారద జీవితానికి ఏ విధంగానూ అభ్యంతరం కాకపోడమే నా ధ్యేయం. మీరు నన్ను క్షమించరని తెలిసినా మీ క్షమాపణకోసం అర్థిస్తున్నాను. ప్రస్తుతం అనకాపల్లి సమీపంలో సత్యన్నారాయణస్వామి కోవెలలో ఉంటున్నాను. మీరు రాదల్చుకుంటే రండి."

ఆ ఉత్తరం చదివేసరికి శారదకీ ప్రసాదరావ్‌కీ ఇద్దరికీ మతిపోయినట్లైంది ఇద్దరూ ఎదుటివాళ్ళకి ధైర్యం చెప్పాలని ప్రయత్నిస్తూనే ఓడిపోయారు.

కనులలో నీరు... మనసునిండా దుఃఖం. శారద అన్నయ్య ఎదుట నిలబడలేక లోపలకు నడిచింది.

ఎందుకిలా జరిగింది! పూలబాటపై సాగవలిసిన తన జీవన శకటం గతుకులదారిలో...

తనేం పాపంచేసింది! తన కెందుకింత శిక్ష! తనజీవితం అంతా కుమిలిపోతూ దుఃఖంతో గడపవలసిందేనా!

శారద కనులముందేదో దృశ్యం... అగ్ని పర్వతాలు బద్దలౌతున్నయ్. కల్లోలమైన సముద్రం - ఉవ్వెత్తున విరిగి పడుతున్న కెరటాలు.

భయంకరమైన తుఫాను చెలరేగింది. అ తుఫాన్లో ఒంటరిగా... ఎవరూ తోడులేకుండా...

ఏదో రాక్షసాకారం ఆమెను కబళించాలని వికటాట్టహాసం చేస్తూ... శారద పరుగెత్తబోయింది. ముందు కెరటాలతో సముద్రం. వెనక అగ్నిపర్వతాలు!... ఎటు చూసినా ప్రమాదమే!

కెవ్వున కేకవేసింది శారద. మరుక్షణంలో ఆమె నేల కూలిపోయింది.

ఆమె కేకవిని ప్రసాదరావ్ పరుగెత్తుకెళ్ళేడు. శారద నేలమీద పడుంది. జుత్తంతా చెదిరిపోయింది. శరీరమంతా చెమటతో నిండిపోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలను బహుభారంగా కదులుతుందామె శరీరం.

కంగారుపడుతూ డాక్టర్కి ఫోనుచేసేడు. డాక్టరొచ్చి ఇంజక్షనిచ్చి వెళ్ళిపోయాడు.

రోజుల గడుస్తున్నాయ్.

శారదలో విపరీతమైన మార్పువచ్చింది. ఆకలి దప్పులూ, నిద్రా అన్నిటినీ మానుకుని ఆలోచనలతోనే గడుపుతుందామె.

అన్నం తినదు... నిద్రపోదూ. అనుక్షణమూ ఎక్కడో శూన్యంలోకి చూస్తూ తనలో తనే ఏదో గొణుగుక్కుంటూ..

శారదను చూస్తూంటే ప్రసాదరావ్‌కి భయమేసింది. మునపటికీ ఇప్పటికీ ఆమె చాలా మారిపోయింది. కలకల లాడే ముఖం కళావిహీనమైంది. నిరంతరమూ ఉత్సాహంగా ఉండే శారద నిర్లిప్తంగా మారిపోయింది.

"శారదా! అన్నం తిందాం రామ్మా!" ఆమె మెల్లగా తలతిప్పి అన్నయ్యవంక చూసింది.

"అన్నం తిందాం రామ్మా..."అనునయంగా పిలిచే డతను.

"అన్నం!... ఎందుకన్నయ్యా!"

"అన్నంతినడం ఎందుకేమిటమ్మా! అన్నం తిన కుండా బతికేదెలా!

"బతకడం ఎందుకన్నయ్యా!

ప్రసాదరావ్ ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు.

బతకడం ఎందుకు ?... ఎవరికోసం బతుకుతుంది శారద ! ఏం చూసి జీవిస్తుంది !

"మనుషులు జీవించాలి శారదా !... తనకోసం కాకపోయినా లోకం కోసం... తనవారి కోసం.."

"లోకంకోసం బతకాలి ! ... లోకంకోసం చచ్చి పోవాలి !... అంతేనా !" విరగబడినవ్వింది శారద.

ప్రసాదరావ్ నివ్వెరపడిచూస్తూ నిలుచున్నాడు. చెల్లెలిస్థితి చూస్తూంటే అతనికేం చెయ్యాలో అర్థంకావటేదు.

"నువ్వు బతుకన్నయ్యా !... నాకు బతకాలని లేదు..." శారద తన గదిలోకి పరుగెత్తి తలుపులు మూసుకుంది.

శారద నవ్విన నవ్వు— ప్రసాదరావ్ గుండెల్లో మారుమ్రోగుతూనే వుంది. ఏకైక సోదరి— అందాలపోగు— చదువుల సరస్వతి— శారదకు మతి చెదిరింది !... కారణం... బావగారు !

ప్రసాదరావ్ కనులు చెమ్మగిల్లాయ్. గుండె తరుక్కుపోతూంటే అతను తన గదిలోకి వెళ్ళిపోయాడు.

శారద మళ్ళీ మామూలు మనిషి కావాలి. ఎలా ?

ప్రసాదరావ్ తనశాయశక్తులా ప్రయత్నించసాగేడు. డాక్టర్లు పరీక్షించి అదొకరకమైన హిస్టీరియా అనీ, భర్త

వద్దకు పంపితే కొద్దికాలంలోనే పరిస్థితి చక్కబడుతుందనీ సలహా యిచ్చేరు.

కాని శారదను భర్తవద్దకు పంపడం— ఎలా సాధ్యం! ప్రపంచంతో సంబంధం తెంపుకుని సన్యాసిగా ఏకాంత వాసం చేస్తున్న ఆ మహానుభావుడు శారద నంగీకరిస్తాడా! శారదకు మళ్ళీ పెళ్ళి చెయ్యమని తనకు తానుగా సూచించిన ఆ పాషాణమూర్తిని తను అంగీకరింప చేయగలడా!

ఫలితం ఏమైనా ప్రయత్నించడం మానవుడి విధి.

"శారదా!... నీకొక చక్కని ప్రదేశం చూపిస్తాను వస్తావా?"

శారద నిర్లిప్తంగా చూసింది.

"నువ్వు రావాలి శారదా! లేకపోతే నాకు వెళ్లాలనిపించడం లేదు." ఎలాగైతేనేం శారద అంగీకరించింది.

ఇద్దరూ అనకాపల్లిలో దిగి బావగారిచ్చిన గుర్తులతో ఆ కోవెల చేరుకున్నారు. ఆ కోవెల అనకాపల్లికి మైలు దూరంలో ఒక కొండమీద నిర్మించబడింది.

ఆలయంలో ఎవరూ లేరు పూజారితప్ప. ఊరికి దూరంగాఉన్న కారణాన ఉత్సవసందర్భాలలోతప్ప మిగిలిన రోజులలో దేవుడు విశ్రాంతిగా పూజారితో కబుర్లు చెప్పుకోవలసిందే.

భక్తులు కాబోలనుకుని పళ్లెమూ, శఠగోపమూ పట్టుకొచ్చేడు పూజారి.

"ఇక్కడొక సాధువుండాలి. మీకు తెలుసా!" పళ్లెంలో రూపాయికాసువేస్తూ అడిగేడు ప్రసాదరావ్.

"ఆయన్ని తెలియక పోడమేం!...రోజూ ఇక్కడ కొస్తూనే వుంటాడు."

"ఆయన నివాసం...!"

పూజారి వారిద్దర్నీ బయటకుతీసుకొచ్చి "అదుగో!... ఆ నదీతీరం కనపడుతూందికదూ!...ఆ చెట్లనడుమ కుటీరంలో వుంటున్నారు." అంటూ చూపేడు.

శారద తనకేమీ పట్టనట్లు యాంత్రికంగా అన్నయ్య ననుసరించింది. ఇద్దరూ కొండదిగి... నాటుతోవన నదీ తీరంవంక నడవసాగేరు. శారదానదీ తీరాన అదొక చిన్న కుటీరం. తీరంవెంబడి రకరకాల వృక్షాలు. ఆ వృక్షాల నడుమ కుటీరం ప్రకృతి సౌందర్యపు వడిలోఉంది. అక్క డకు అరమైలు దూరంలో చిన్నపల్లెఉంది.

తాటి కమ్మలతో నేయబడిన కుటీరం. నేత్ర పర్వంగా నిలుచుంది. ప్రసాదరావూ శారదా ఇద్దరూ కుటీరంలో అడుగుపెట్టేసరికి... పాలుకాచుకుంటున్న సన్యాసి అడుగుల సడివిని వెనుదిరిగిచూసేడు. జడలు కట్టినజుత్తూ - దీర్ఘంగా పెరిగిన గెడ్డమూ-కాషాయవస్త్రాలూ - బావగార్ని పోల్చేం దుకు ప్రసాదరావ్ తికమకపడ్డాడు.

"మీరు...!" సంశయంగా చూసేడాయన.

"ప్రసాదరావ్‌ని... ఈమె నా చెల్లెలు శారద."

శారద ఈ లోకంలో లేదు. ఆమె దృష్టి ఎక్కడో ఉంది. మరబొమ్మలా అన్నపక్కన నిలబడిందామె.

"కూర్చోండి." ఈతాకులచాప పరచేరాయన.

బయట ఎఱ్ఱగా ఎండకాస్తున్నా కుటీరంలో చల్లగా వుంది. పాలు కాచుతూండటాన వచ్చే సువాసన కుటీరంలో వ్యాపించింది.

"ఇంత ప్రశాంతంగా జీవించగలగడం అదృష్టమే కాని కేవలం ప్రకృతికీ ప్రశాంతతకీ అంకితమై- స్వజనులను దుఃఖ పెట్టడం మీకు న్యాయమేనా!" అడిగేరు ప్రసాదరావ్.

ఆయన ముఖంలో ఒకే ఒక్క మందహాసం తళుక్కున మెరిసి మాయమైంది. "మానవుడు తనకు తానుగా ఎవరికీ న్యాయాన్యాలు చెయ్యలేడు. భగవంతుని లీలలో మనిషి ఆటబొమ్మ మాత్రమే.

జీవితం ఎన్ని మలుపులు తిరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఆనాడు శారదను వివాహం చేసుకుంటానని గానీ, ఇలా సన్యాసి నౌతాననిగానీ నాకూ తెలియదు. కానీ..."

ప్రసాదరావ్ ఆవేశం అరికట్టుకోలేక "శారద జీవితం ఎంత దారుణంగా తయారైందో తెలుసుకో గలిగితే

మీ రిలా మాట్లాడలేరు. కనీసం యిప్పుడైనా మేలుకుని జాగ్రత్త పడకపోతే శారద గతి..." అంటూ ఆగిపోయాడు.

శారదా- నేను- ఇద్దరి జీవితాలూ సమాంతరంగా నడుస్తున్నాయ్. ఈ రెండూ కలుసుకోవడం అసంభవం!

"బావగారూ!" కోపం ఆపుకోలేక పోయాడు ప్రసాదరావ్.

ఆయన విరాగి. తన జీవితాన్ని గడ్డిపరకలా భావించగలడు. కాని ఎదుటివారి విషయం ఆలోచించడేం!

"సంబంధ బాంధవ్యాలు మానవ నిర్మితాలు. ప్రపంచంలోకి మానవుడు ఒంటరిగా వస్తాడు. వెళ్ళేటప్పుడూ తోడెవరూ ఉండరు. ఎవరి జీవితం వారిది. ఎవరికెవరూ ఏమీ కారు. మమతా, మమకారమూ అన్నీ మిథ్య."

ఆయన ధోరణి ప్రసాదరావ్‌ని క్రుంగదీసింది. అతన్ని బాధిస్తున్నదల్లా ఒక్కటే. శారద భవిష్యత్తేమిటి! ఏ ఆశతో జీవించాలామె!

"అంతేనా! ఒక్కసారి శారదనుచూడండి. మీ మూర్ఖవైరాగ్యంతో ఆమె జీవితం నాశనంచేస్తారా! జన్మించింది జీవించడానికా లేక మరణ సదృశంగా కాలం గడపడానికా! ప్రపంచముతోనూ మనుషులతోనూ సంబంధాలు తెంపుకునేకంటె వారితో కలిసి జీవించడంలోనే పరమార్థముంది. మీరు యింటికిరండి. మీరు కష్టపడి

సంపాదించ నవసరంలేదు. ఆవరణలో ఒక్కపాక వేసుకుని మీకు చేతనైతే శారదనుకూడా విరాగిని చెయ్యండి..."

"నేనొక నిశ్చయానికి వచ్చేక అది మార దు నాయనా!...విశ్వమనే యీ విశాల నాటకరంగంలో ఎవరి పాత్రను వారు నిర్వహించుకోవాలేతప్ప ప్రక్కవారిని సరి దిద్దబోడాని కర్హులుకారు.

నేను నదీతీరానికి వెళ్తున్నాను. ఇక మీరు వెళ్ళవచ్చు."

ఇంత జరుగుతున్నా శారదలో ఏ చలనమూ లేదు. కేవలం ఒక పిండిబొమ్మలా కూర్చుందామె.

వడివడిగా అడుగులువేస్తూ వెళ్తున్న ఆయనను చూస్తూంటే ప్రసాదరావ్ హృదయంలో శూలాలు దిగు తున్నట్లుంది. శారదనుచూసి ఏమీ చేయలేని అసమర్థుడిలా నిలచిపోయేడతను.

"ఇందుకా అన్నయ్యా నన్ను రమ్మనావ్!" మెల్లగా అడిగింది శారద.

అతను తెల్లబోయి ఆమెవంక చూసేడు.

"నా భవిష్యత్తేమిటో నాకు తెలుసన్నయ్యా! నన్నేదో శాపం వెంటాడుతూంది. కొన్నాళ్ళకు నా దురదృష్టాన్ని నేనే సహించలేక జీవితం చాలించుకుంటానేమో!"

"శారదా!"

"ఎందుకంత భయపడతావ్! దుర్భరమైన జీవితం కంటెమృత్యువు చాలా సుఖంగాఉంటుందేమోఅన్నయ్యా!"

"వీల్లేదు శారదా!... ఏనాడూ ఆత్మహత్య చేసుకోననీ– నన్ను ఒంటరిగా వదలిపోననీ— ప్రమాణం చెయ్యవూ!"

"మనషులే అశాశ్వతమైనప్పుడు వారిమాటలకు విలువేముంటుందన్నయ్యా! ఈ నాడు వాగ్దానం చేసినా, నిలబెట్టుకో గలనన్న ధైర్యం నాకులేదు."

శారదమీద జాలి!... ఆ సన్యాసిమీద కసి!!

భారంగా కదిలేడు ప్రసాదరావ్.

* * * *

ఎవరి కష్ట సుఖాలతోనూ తనకేమీ సంబంధం లేదన్నట్లు కాలం మామూలు వేగంతో గడచి పోతూంది.

మూర్తీభవించిన నిరాశలా కంటికెదురుగా మసులుతున్న శారదను చూస్తూ లోలోవ ఆమె జీవితంలో వెలుగు ఉదయింప జేయాలని మార్గం అన్వేషించ సాగేడు ప్రసాదరావ్.

శారద సక్రమంగా జీవించాలంటే ఒకేఒక్క మార్గముంది.

ఆమెకు మళ్ళీ వివాహం చెయ్యాలి. కాని శారద ఒప్పుకుంటుందా! ఆమె నెలాగో ఒప్పించినా, శారీరకంగా, మానసికంగా దిగజారిపోయిన శారద నెవరు చేసుకుంటారు! ఆమెకోసం తనేమైనా త్యాగం చెయ్యగలడు. కాని శారదను చేసుకుందు కిష్టపడేవాడు సహృదయుడూ ఆదర్శవంతుడూ అయ్యుండాలి. అటువంటివాడు తనకి దొరకుతాడా!

ఒకనాడు మెల్లగా చెల్లెల్ని కదిలించాడు ప్రసాద రావ్.

"చూడు చెల్లాయ్! జరిగిందేదో జరిగి పోయింది. గతాన్ని తలుచుకుంటూ వర్తమానాన్నీ భవిష్యత్తునీ భగ్నం చేసుకోడం న్యాయమే అంటావా!

శారద ప్రశ్నార్థకంగా చూసింది.

"విధి చేసిన గాయానికి కాలంతో కట్టుకట్టి మాన్పు కోవాలి."

"నీ ఉద్దేశం స్పష్టంగా చెప్పు... నాకేమీ అర్థం కావడం లేదు."

"మానవు లన్నివిషయాల్లోనూ నిస్సహాయులు కారు చెల్లాయ్. మనిషికి సాధ్యమైన వికూడా కొన్ని ఉన్నాయ్. శారదా! జీవితమంటే విషాదగీతమేనా! సుఖ దుఃఖాలు — రాగద్వేషాలూ — మంచీ చెడూ అన్నీ కలి స్తేనేకదా జీవితం! ఇటువంటి మహోన్నతమైన జీవితాన్ని

కన్నీటిమయం చేసుకుని ఆజన్మాంతమూ క్రుంగిపోతే— చివరకు మిగిలేదేమిటి శారదా !"

శారద అయోమయంగా అన్నయ్య ముఖంలోకి చూసింది.

"నువ్వు...నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకోవాలి చెల్లాయ్!"

"అ...న్న...య్యా !... నన్నర్థంచేసుకోలేవా అన్నయ్యా ! ఆయన బతికుండగానే... నాకు మళ్ళీ... వద్దన్నాయ్ ..."

"ఆయన బతికున్నా - చచ్చిపోయినా ఒకటే !" కోపంగా అన్నాడతను.

"ఆయనేమీ అనకన్నయ్యా ! నా దురదృష్టాన్ని నన్ను నిందించు కాని వారినేమీ అనకు..."

ప్రసాదరావ్ కి కొరడా చివర తగిలినట్లైంది. శారద ఏమిటంటూంది? తన జీవితాన్ని నాశనం చేసిన అతన్ని ఎందు కంత గౌరవిస్తూంది ! అతని మూర్ఖత్వాన్నీ కాఠిన్యాన్ని తన దురదృష్టంగా సరిపెట్టుకుంటూందా ! ఎప్పుడో ఏమీ ఎరుగని వయసులో తాళికట్టేడని- రాక్షసుడి కంటె అన్యాయంగా ప్రవర్తించిన భర్తని ఉన్నతుడిగా భావించి దైవంలా కొలుస్తుందా !...

ఎందుకిలా చేయగలుగుతుంది ! భారతస్త్రీ లక్షణమా యిది !

భర్త అనబడే దుర్మార్గుడి శాడిన్యానికి జీవితం బలై పోతున్నా అతన్ని భగవంతుడిలా ఆరాధిస్తూ తననుతాను నిర్లక్ష్యం చేసుకోడమేనా భారతస్త్రీ గొప్పతనం !

ప్రసాదరావేదో చెప్పాలని ప్రయత్నించబోయేంతలో శారద అక్కడినుంచి వెళ్ళిపోంది.

*　　*　　*　　*

ప్రసాదరావ్ కథ ముగించేడు.

"తొమ్మిదిదాటింది. నేను వస్తాను రావ్‌గారూ !"

"పదండి మిమ్మల్ని కారులో డ్రాప్ చేస్తాను."

మధుమూర్తి వద్దన్నా వినకుండా ప్రసాదరావ్ అతన్ని రూము దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

ఏకాంతంలో ప్రశాంతంగా ఉండామనుకున్న మధు మూర్తికి శారద కథ గుర్తుకొచ్చి మనసుని వేధింప సాగింది.

ఆ రాత్రి అతను భోజనం చెయ్యకుండానే నిద్ర పోయాడు.

కలలో... శారద... ప్రసాదరావ్... ప్రభావతి... రంగనాథంగారు విశాలాక్షి... అందరూ మధుమూర్తికి సమస్యలయ్యారు.

5

ఆఫీసుపని తెమిలేసరికి అయిదున్నర దాటింది. మధుమూర్తితోపాటు శంకరం అనే మరో గుమాస్తా కూడా ఉండిపోయాడు.

"కాఫీతాగిపోదాం మూర్తిగారూ!"

మధుమూర్తి అతనితో కాంటీన్‌కి నడిచేడు.

ఆఫీసులో ఉన్నవారందరిలోనూ మధుమూర్తితో కొద్దిగా చనువున్నది శంకరానికే.

"నిన్న మీరు..."

మధుమూర్తి మాట్లాడలేదు.

"వారు మీకు బంధువులా!"

"స్నేహితులు."

"కొద్దిగా జాగ్రత్తగా ఉండండి. ఆవిడ అన్నయ్య... పిచ్చితో బాధపడుతున్న ఆమెకు పెళ్ళి చేయాలని..."

"నాకంతా తెలుసు."

శంకరం యిక మాట్లాడలేదు. బస్సు రాగానే ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

రూములో అడుగు పెట్టబోతూంటే ... రంగనాథంగారు ఉత్తరం అందించారు.

"మేమంతా క్షేమంగా ఉన్నాము. నువ్వు క్షేమంగా ఉన్నావని తలుస్తున్నాము. మొన్న మామయ్య ఉత్తరం రాశాడు. విశాలాక్షి పెళ్ళి త్వరగా జరిపించాలనన్నట్లు తన ఉద్దేశం తెలియబరిచేడు. కనుక నీకు శలవెప్పుడు దొరికేదీ రాస్తే ఏర్పాట్లన్నీ చేస్తాను. వీలైనంత త్వరలో శలవు కోసం ప్రయత్నించు. అమ్మా, రాధా అందరూ క్షేమంగాఉన్నారు. రాధ ఈ మధ్యే వచ్చింది. నిన్ను మరీ మరీ అడిగేనని రాయమంది. నీ సమాధానం కోసం ఎదురు చూస్తూంటాను ..."

మధుమూర్తి నిర్లిప్తంగా ఉత్తరాన్నిమడిచి సొరుగులో పడేశాడు. మామయ్య తొందరపడుతున్నాడు!... న్యాయమే మరి!

తను దురదృష్టాన్ని కౌగలించుకోబోయే రోజులు ఇంకా ఆట్టే దూరంలేవు. అందుకు తను యిప్పటినుంచీ సిద్ధపడాలి.

మధుమూర్తి కలతచెందిన మనసుతోనే నిద్ర పోయాడు.

* * * * *

ప్రభావతి మధుమూర్తి విషయంలో నిరాశ చేసుకుంది. అమ్మా నాన్నా తనను రాజాకివ్వాలనే అనుకుంటున్నారు. తనకి రాజాఅంటే ఏ మాత్రమూ సదభి

ప్రాయంలేదు. కాని మధుమూర్తి మౌనంగాఉండిపోయాడు. కాబట్టి తనకు రాజాను చేసుకోడంకంటే గత్యంతరంలేదు. ఏదో జరగబోతుందని భయపడటం -మూర్ఖత్వమే నాన్న అడిగితే రాజాఅంటే యిష్టమే అనిచెప్పాలి.

* * *

రాజా సోఫియాకు ఉత్తరం రాయసాగేడు.

"సోఫియా!... నిన్ను నేను ప్రేమించాను. ఈ విషయం నీకు తెలుసు. నువ్వు నన్ను ప్రేమించావ్. కాని నీకేమీ తెలియనట్లు నటించావ్. నీతో చక్కటిలైఫ్ గడుపుదామని ఆశించాను. తీరా పెళ్ళివిషయం ఎత్తేసరికి ఆ మాటదాటవేశావ్.

నీ సాంగత్యం ఒకనాటిదికాదు. రెండు సంవత్సరాలు కలిసిఉన్నాం. నిన్నువదలి ఉండటం — నాకు సాధ్యం కాదు.

ఇక్కడ ఒక ప్రైవేటుఫరమ్‌లో జాయినయ్యాను. నెలకు వెయ్యి రూపాయలజీతం. నువ్విక్కడకువస్తే యిద్దరమూ సుఖంగా జీవించవచ్చు. సోఫియా! బాగా ఆలోచించు. ఇండియాలో సుఖంగానే జీవించవచ్చు. నీ వంటి విద్యావంతురాలికి అపరిమితమైన గౌరవం లభిస్తుంది. ఆలోచించి నన్ననుగ్రహించు. త్వరలో సమాధానం రాస్తావ్ కదూ! మరో విషయం-ఇక్కడ అమ్మాయివాళ్ళు వత్తిడి

చేయగా ప్రభావతి అనే అమ్మాయిని చూడటం జరిగింది. కాని వెయ్యిమంది ప్రభావతులైనా ఒక్క సోఫియాకు సరి తూగగలరా!

డియర్ సోఫియా!... వెంటనే మంచి ఉత్తరం రాస్తావ్ కదూ!

నీ రాజా.

ఉత్తరం టైపుచేసి పోస్టుకు సిద్ధంచేసేడు రాజా. సోఫియాతో గడిపిన మధురమైన దినాలు గుర్తుకొచ్చి మైమరచిపోయాడతను.

6

నెలరోజులు గడిచాయ్. ప్రసాదరావ్ ఆఫీసుపని ఎక్కువగా ఉండటంచేతా, తరచుగా క్యాంపులు వెళ్ళటానా మధుమూర్తిని కలుసుకోలేదు. మధుమూర్తి గురించి ఆఫీసులో చాలామంది రకరకాలుగా ఊహించసాగేరు.

డబ్బుకోసం అతనా మతిస్థిమితంలేని అమ్మాయిని చేసుకుందుకు సిద్ధపడుతున్నాడనే అందరూ భావిస్తున్నారు. కాని మధుమూర్తి మాత్రం శారద కంటపడకుండా జాగ్రత్త పడుతూనేఉన్నాడు. శారదంటే అతనికి చాలా సానుభూతి ఉన్నా ... ఆమె సమక్షంలో ఒక్క క్షణం గడపాలన్నా

భయమూ సంకోచమూ ఆవరిస్తున్నాయ్. కోరిన వస్తువు అందకపోతే-ఏ నాటికీ తనకు లభించదన్న నిశ్చయానికొస్తే- మనుషులు నిరాశగా ఆ విషయం మరిచిపోడానికే ప్రయత్నిస్తారు. ఐతే అలా మరిచిపోడం సాధ్యమైతే బాధ లేదు. అలా కాకుంటే మనిషికి శాంతిఉండదు.

మధుమూర్తిపై తన ఆశలన్నీ నిలుపుకుని అడియాసలే అని తెలుసుకున్న ప్రభావతి — రాజాను చేసుకోడం యిష్టమేనా అని తండ్రి అడిగితే అంగీకారం సూచించిన ప్రభావతి— ఎంత ప్రయత్నించినా తనకుకాకుండా దూరమైన మధుమూర్తిని మరువలేక మధనపడుతూంది.

కొద్దికాలంలో తను రాజా అధీనంలోకి వెళ్ళబోతూందని తెలిసినా ఆమె మధుమూర్తి గురించి విచారించడం చిత్రమే.

ఒక్క-సారీ మధుమూర్తి పన్నెత్తి పలుకలేదు. అతనెవరో తెలియదు. ఐనా అతనిపై అనురాగం పెంచుకుంది ప్రభావతి !

“ప్రభా !... కాఫీకి పిలువమన్నారు మీ నాన్నగారిని”

ప్రభావతి లేచి తండ్రి గదిలోకి వెళ్లింది.

గడియారం మూడు కొట్టింది.

“మీకోసం ఎవరో అమ్మగారు వచ్చారు బాబూ!”

డిస్పాచ్ రిజిష్టరు పక్కన బెట్టి బయటకు వెళ్ళేడు మధుమూర్తి.

రిసెప్షన్ రూములో శారద!

"మీతో చాలా అర్జంటు పనుంది ఒక్కసారి యింటికి రండి!"

నిర్ఘాంతపోయి నిలుచున్నాడు మధుమూర్తి.

"ప్లీజ్!... త్వరగా రండి..." శారద కంగారుగా చూసింది. అతను పర్మిషన్ కాగితం పంపి ఆమె వెనక నడవ సాగేడు. ఇద్దర్నీ చూస్తూ రిసెప్షనిస్ట్ హేళనగా నవ్వింది పక్క వాళ్ళని హెచ్చరిస్తున్నట్లు.

ఒక్కసారి శారద వెనక్కి తిరిగి "ఎందుకలా నవ్వుతావ్! నీకేం పిచ్చా! మమ్మల్ని చూసి నవ్వుదేనికి! బుద్ధి లేదూ!" అంటూ గర్జించి ఆమెవంక క్రోధంగా చూసింది.

ఆమె కోపం చూచి మధుమూర్తి ఆందోళన పడ్డాడు ఏం గొడవ జరుగుతుందో అని.

రిసెప్షనిస్ట్ నవ్వుమాని తెల్లబోయి చూసింది.

"మానర్సు తెలియని మూర్ఖులు" శారద వడివడిగా నడిచింది.

ఆమె మామూలు పరిస్థితిలో లేదని తెలిసినా— ఆమెను ప్రతిఘటించినా ప్రయోజనముండదని ఆమెతో

కారెక్కాడు మధుమూర్తి. మరుక్షణంలో కారు శరవేగంతో దూసుకుపోయింది. కాసేపటివరకూ తనెక్కడున్నాడో ఏమయ్యాడో అర్థం కాలేదు మధుమూర్తికి.

"త్వరగా నడవండి... నా గదిలోకెవరో దుర్మార్గుడొచ్చి..."

శారద మేడమీదకు పరుగెత్తింది. అతనామెతో అక్కడకు పరుగెత్తేడు.

తన గదిలో నలుగుమూలలా వెతికి "పిరికివాడు పారిపోయాడు. వాడెంత మూర్ఖుడో తెలుసా? మనిద్దర్ని దూరంగా విసిరేస్తాడుట!" అంటూ మధుమూర్తిని సమీపించిందామె

" మధుమూర్తిగారూ !.... నన్ను విడిచి వెళ్ళిపోతారా!" వెక్కి వెక్కి ఏడుస్తూ అతని కళ్ళల్లోకి చూసిందామె.

అతనిలో చలనం లేదు. చైతన్యంలేని శిల్పంలా నిలుచున్నాడు.

"చెప్పండి మూర్తీ !...త్వరగా చెప్పండి. మీరు లేకపోతే నేనేమైపోతానో...మీరంటే నాకెంత ప్రేమో తెలుసా! ఎంతంటే..." రెండు చేతులూ అతని భుజాల మీదవేసి వాలిపోయింది.

మధుమూర్తి ఇంకా నిశ్చైతన్యంగానే నిలబడ్డాడు. జరుగుతున్న దేమిటో అతని కర్థం కావడం లేదు. ఒక్కసారి హఠాత్తుగా కళ్ళల్లో కోటిసూర్యులకాంతి పడితే ఎలా మారి పోతాడో, అలాగే మారిపోయాడతను. కనులున్నాయ్. కాని అవి చూడటం లేదు. మెదడుంది. కాని ఆలోచించడం లేదు.

అతని పాదాలమీద వాలిపోయింది శారద శరీరం ! అయినా అతనలాగే ఉండిపోయాడు.

క్షణాలు ... నిముషాలు ... కాలం గడుస్తోంది.

ఒక్కసారతను తెలివొచ్చినట్లు చూసేడు. తన పాదాల మీద శారద !

"రంగమ్మా!"

రంగమ్మ రాలేదు.

అతను మెల్లగా ఆమెను లేవనెత్తి మంచం మీదకు చేర్చేడు. ఈ లోకంతో ఏ సంబంధమూ లేనట్లామె కనులు మూసుకుని తన ప్రపంచంలోకి వెళ్ళిపోయింది.

ఆమెను చూస్తూ కూర్చున్నాడతను.

ఎవరీ శారద ? తన జీవితంలో ప్రవేశించి సమస్యలు లేకెత్తిస్తూందెందుకని? ఎవరితోనూ సంబంధ బాంధవ్యాలు పెట్టుకోకుండా కాలం గడపాలనుకునే తననీ సుడిగుండంలో

కెందుకు తీసుకొచ్చింది! తనామెకేవిధమైన ఉపకారమూ చెయ్యలేదు. ఆమెవంటి అదృష్టహీనురాలికి తనవంటి నిర్భాగ్యుడు చేయగలిగే దేముంది!

"బాబూ!" మధుమూర్తి అటు చూసేడు.

"అమ్మగారికి మళ్ళీ వచ్చిందా!"

"ఊఁ... వంటరిగా వదలిపెట్టి ఎక్కడకు వెళ్ళేవ్!"

"మా పిల్లడికి వంట్లో బాగులేదు బాబూ. ఎలాఉందో చూసొద్దామని..."

"సరే. నేనువస్తారు."

మధుమూర్తి రూముకి వెళ్ళకుండా బీచ్‌కి వెళ్ళేడు. చీకటి పడేవరకూ అక్కడ గడిపి భోజనం చేసి గదికి వచ్చాడు.

తొమ్మిది... పది... పదకొండు... గడియారం నిర్విరామంగా తన విధి నిర్వహిస్తూనే ఉంది.

మధుమూర్తికి ఎంతసేపటికీ నిద్రపట్టలేదు.

"నిన్నెంత ప్రేమిస్తున్నానో తెలుసా!" పాదాల మీద వాలిన శారద!

"మీ మీద ఎన్నో ఆశలుపెట్టుకున్నాను!" ప్రభావతి ఉత్తరం!

ఎందుకిలా ప్రేమిస్తారు! ఎదుటివారి అర్హతానర్హతలు చూడకుండా ప్రేమించి... అయినా ప్రేమంటే ఏమిటి!

మధుమూర్తి మస్తిష్కంలో కందిరీగల గుంపులాంటి సమస్యలు. అతని మెదడంతా గందరగోళమైంది. ప్రతివ్యక్తీ అతన్ని కావాలని బాధిస్తున్నట్లే భావించసాగేడు.

ప్రభావతి ... శారద ... రంగనాథంగారు.. విశాలాక్షి.. తండ్రి ... ఎందుకందరికీ తనమీద కసి! అందరూ తన నెందుకు సమస్యల సుడిగుండంలోకి తోస్తారు! తనేం నేరం చేసేడు!

విపరీతమైన తలనొప్పి. కణతలు నొక్కుకుంటూ నీరసంగా మంచంమీద వాలేడు.

మర్నాడు లేచేసరికి తొమ్మిదయింది. వళ్ళంతా తేలిపోతున్నట్లుంటే ఎలాగో కాలకృత్యాలు తీర్చుకుని ఆఫీసుకి బయల్దేరేడు మధుమూర్తి. ఆఫీసులో అడుగు పెట్టడానికి ధైర్యంచాలలేదు. తన గురించి ఎంతగొడవ జరుగుతుందో! ఎందరెన్ని ప్రశ్నలువేస్తారో!

ఎందుకు! తను ఏ నేరమూ చెయ్యలేదు. శారద వచ్చింది. తప్పనిసరై తను వెళ్లేడు. దీనిలో తను భయపడవలసినదేముంది!

తడబడుతున్న అడుగులతో సీటులోకివెళ్లి కూర్చున్నాడు మధుమూర్తి. టేబుల్‌మీద తనకొక కవరుంది.

ఆ ఉత్తరం తండ్రిరాసేడు. వచ్చేనెలలో ముహూర్తాలున్నాయిట! కనుక ఆఫీసుకో నెల శలవుపెట్టి వీలైనంత తొందరగా బయలుదేరి రమ్మన్నాడు తండ్రి.

లీవ్ లెటరు రాస్తూంటే మధుమూర్తి చేతులు వణకాయి. పెళ్ళైతే --తనకు జీవితంలో ఏ మాత్రమూ సౌఖ్యం లభించదు సరిగదా ఇప్పుడున్న కొద్దిపాటి స్వేచ్ఛకూడా మాయమౌతుంది. అయినా పెళ్ళనేదాన్ని ఎందుకు విధించేరు పెద్దలు? అది లేకుండా స్త్రీ పురుషులు జీవించలేరా! శారదకు పెళ్ళైంది. కాని ఆమె ఏం సుఖపడింది? ఆ పెళ్ళే జరిగి ఉండకపోతే ఆమెకింత బాధ ఉండేదా!

తనెంత అసూయకరంగా ఆలోచిస్తున్నాడో అర్థమయ్యేటప్పటికి మధుమూర్తి తనలో తానే సిగ్గుపడ్డాడు.

"బాబూ! మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు!"

ప్యూను వెంట ఆఫీసరుగదిలోకి నడిచేడతను.

"మిస్టర్ మధుమూర్తీ!... నీ గురించి రిసెప్షనిస్టు రిపోర్టు చేసింది. అయినవారినీ కానివారినీ ఆఫీసు కాహ్వానించి ఆవిడ నవమానింప జేస్తున్నావట!... నిజమేనా మధుమూర్తీ! నువ్వు చాలా మంచివాడవనే అనుకున్నానింత కాలమూ." ఆఫీసర్ గారతని ముఖంలోకి సూటిగా చూసేరు.

"క్షమించండి. నిన్నవచ్చినామె పిచ్చిది!... ఆమె కావాలని సౌభాగ్యవతిగారి నవమానించలేదు..."

"పిచ్చిదా! ఆమె మీకు...!"

"ఏమీ కాదు..." లీవ్ లెటరు ఆఫీసరు కందించాడు మధుమూర్తి ఇక ఆ విషయాన్నాపుజేయాలని.

"నెల్లాళ్ళు శలవెందుకయ్యా? వంట్లో బాగులేదా?"

"నాన్నగారు నాకు సంబంధం చూసేరట..." తల దించుకున్నాడు.

"కంగ్రాట్యులేషన్స్!... ఇవాళ పదో తారీఖుకదూ! మే ఒకటి నుంచి గ్రాంట్ చేస్తాను."

"థాంక్యూ వెరీమచ్..." మధుమూర్తి అక్కడి నుంచి బయటపడ్డాడు. కంగ్రాట్యులేషన్స్!... ఎందుకూ! ఉన్న బాధలు చాలక మరో భారం తలకెత్తుకుంటున్నందుకా!

ఆ రోజు వర్కేమీ కాలేదు. అన్యమనస్కంగానే ఐదు గంటలవరకూ గడిపి బయటపడ్డాడు.

జైలురోడ్డుదాటి వచ్చేసరికి ప్రసాదరావ్ ఎదురయ్యాడు. అతని దృష్టిలోపడకుండా తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా విఫలమే ఐంది.

"ప్లీజ్...కమిన్.." ప్రసాదరావ్ కారుతలుపు తెరిచేడు.

"క్షమించండి. నేసింకా కాఫీకూడా తీసుకోలేను. ఇప్పుడే ఆఫీసు నుంచివస్తున్నాను."

"ఐతే హోటల్‌కి పోదాం పదండి." కారు వెనక్కి తిప్పి హోటల్‌కు తీసికెళ్ళేడు. ఇద్దరూ కాఫీతాగి బయటకొచ్చేరు.

"మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి అలా బీచ్‌కి పోదామా !"

మధుమూర్తి కాదనలేక పోయాడు. ఎవర్నీ కాదన లేని యీ మెత్తదనమే తనకిన్ని చిక్కులు తెస్తూందని అతనికి తెలుసు. ఐనా మారలేకపోయాడు.

రామకృష్ణా మిషన్ దాటి రెండుమూడు ఫర్లాంగుల దూరంలో ఆగింది కారు. ఇసుకలో నడుస్తూ ఇద్దరూ ఒక చోట ఆగిపోయారు.

"ఇలా కూర్చుందామా !"

"ఊఁ..." కూర్చున్నాడు మధుమూర్తి.

"నిన్న మీరు కాపాడకపోతే శారద..." మెల్లగా అన్నాడు ప్రసాదరావ్.

"అనుక్షణమూ ఆమె వెంట ఎవరో ఒకరుండేలా చూడటం మంచిది రావ్‌గారూ !"

"ఆవేశంలో ఆమె ఎవర్నీ లెక్కచెయ్యదు. చివరికి నన్నుకూడా..."

మధుమూర్తి సముద్రం వంకచూస్తూ మౌనంగా ఊరుకున్నాడు.

"శారద నిన్నరాత్రి మీ గురించి విపరీతంగా కలవ రించింది మధుమూర్తిగారూ !"

తుళ్ళిపడ్డాడు మధుమూర్తి.

"ఆమె మిమ్మల్ని ప్రేమిస్తూంది... మధుమూర్తి గారూ! మా కష్టాలు తీరేరోజులు దగ్గరకొచ్చాయ్. మీరు శారదను చేసుకోవాలి..."

"నే...నా!"

"అవును. మీరు చాలా సహృదయులు... మీరెంత ఉన్నతులు కాకపోతే శారదనంత సానుభూతితో ఆదరిస్తారు!.. మూర్తిగారూ! శారదను మీతో వివాహం జరిగితే ఆమె తప్పక మామూలు మనిషౌతుంది. ఈ త్యాగం మీరు చెయ్యాలి... నిండుజీవితం నాశనం కాకుండా కాపాడ గలిగే సామర్థ్యం మీకే ఉంది. నా ఒక్కగా నొక్క చెల్లెలి కోసం నా ప్రాణాలిమ్మన్నా సిద్ధంగా ఉన్నాను. నాదీ శారదదీ యావదాస్థి మీ కిచ్చేస్తాను. మీరూ శారదా సుఖంగా ఉండటంకంటె నే నింకేమీ కోరను. నన్ను కాదన కండి మూర్తిగారూ!" ప్రసాదరావ్ ఉద్వేగం ఆపుకో లేకపోతున్నాడు. అతని కనులవెంట నీరు కారుతుంది.

"రావ్‌గారూ!..."

"నన్ను కాదనకండి మూర్తిగారూ!" దీనంగా అర్థి స్తున్నాడు రావ్.

"చెల్లెలి సుఖంకోసం మీ సర్వస్వమూ త్యాగంచేయ బోతున్న మిమ్మల్ని ఎలా అభినందించాలో అర్థంకావడం

లేదు. రావ్‌గారూ మీరనుకున్నట్లు నేను శారద జీవితాన్ని ఉద్ధరించడానికి సమర్ధుణ్ణికాను. నిజానికి నేను చాలా బల హీనుణ్ణి ... ఎవరికి యేమి చేయలేని అసమర్ధుణ్ణి, నన్ను క్షమించండి రావ్. వచ్చేనెలలో నాకు..." తండ్రి రాసిన ఉత్తరం అందించేడు మధుమూర్తి.

అంతా చదివిన ప్రసాదరావ్ నీరసంగా చూసేడతనివంక.

"విశాలాక్షి మా మామయ్యకూతురు. ఆమెను నేను వివాహం చేసుకోవాలని ఐదు సంవత్సరాలక్రితమే పెద్దలు నిర్ణయించేరు. దాన్నిప్పుడు కాదనడం ఎవరికీ సాధ్యంకాదు"

"ఐదేళ్ళక్రితం !" ఆశ్చర్యపోయాడు ప్రసాదరావ్.

"ఆ పరిస్థితు లటువంటివి. మా నాన్నకు నేనూ రాధా యిద్దరమే. రాధ కిప్పటికి పదిహేనేళ్ళు. ఎంత కట్నమిస్తానన్నా ఎవరూ చేసుకోలేదు. రాధ వివాహం నాన్నకో పెద్ద సమస్యైంది."

"ఏం !"

"రాధకు దృష్టిలేదు." బాధగా అన్నాడు మధు మూర్తి. "మామయ్య తన తమ్ముడు చనిపోగా అతని కొడుకును తనదగ్గరే పెంచసాగేడు. అతనంత చదువుకోలేదు. అయినా రాధకతన్నిచ్చి పెళ్ళి జరిపించాలని ఒక షరతు మీద ఒప్పుకున్నాడు మామయ్య"

" ఏమిటది ! "

"మామయ్య కూతురు విశాలాక్షిని నేను చేసుకో వాలి. నేనందు కంగీకరిస్తే రాధ పెళ్ళి జరుగుతుంది. ఈ వరతుకి నేనూ నాన్నా ఇద్దరమూ అంగీకరించలేదు మొదట. కాని రానురాను రాధని చూస్తూంటే గుండె కరిగిపోయేది. చెల్లెలి జీవితమంతా నా నిర్ణయంపై ఆధారపడి ఉంది. నేను విశాలాక్షిని చేసుకోనంటే రాధ జీవితం శూన్యమే ఔతుంది. గుడ్డిదైన రాధను ఎవరు చేసుకుంటారు!

చాలారోజులు ఆలోచించి విశాలాక్షిని చేసుకుందుకే నిర్ణయించుకున్నాను. కాని నా నిర్ణయం— నాన్నగారెంత మాత్రమూ ఆమోదించలేదు. రాధ సంగతి సరేసరి. తనకోసం నా సుఖాలూ సరదాలూ నాశనం చేసుకోవద్దని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

చివరి కెలాగో అందర్నీ ఒప్పించేను.

కొద్దికాలంలోనే రాధకు పెళ్ళైంది. దానితోపాటే నాకూ విశాలాక్షికీ ఒకవిధమైన సంబంధం ఏర్పరచ బడింది."

"విశాలాక్షిని చేసుకోడం— మీకిష్టంలేదా!"

మధుమూర్తి ఏ భావమూ వ్యక్తంచెయ్యకుండా దృష్టి సముద్రంవంక సారించేడు.

"శారద విషయం... నేను కొంచం స్వార్థంగానే ప్రవర్తించానేమో!.." అపరాధిలా అన్నాడు ప్రసాదరావ్.

మధుమూర్తి ఏమీ అనలేకపోయాడు.

తనెంత బలహీనుడు !... ఇన్నాళ్ళూ తన చరిత్రని చెప్పుకోడానికి భయపడి... చాలామందిని బాధించేడు. శారద- ప్రభావతి_ ఇద్దరూ తనని వేరేవిధంగా అర్థంచేసుకో డానికి బాధ్యుడు తనే. తన దురదృష్టం- ముందే వాళ్ళకి విశదీకరించి చెప్పడం జరిగితే- ఇన్ని అనర్థాలకూ అపజయా లకూ ఆస్కారం ఉండేది కాదేమో ! కాని తన లో ని లోపాలనూ అసమర్థతనీ ఎదుటవారికి నిస్సంకోచంగా చెప్ప డానికి మనిషికెంత ధైర్యం కావాలి !... తనవంటి పిరికి వాడికి ఆ ధైర్యం ఎలా ఉంటుంది !

తన రహస్యం బయటపడితే హృదయం తేలికపడు తుందని ఆశించాడు. కాని అటువంటిదేమాత్రమూ జరగ లేదు.

మధుమూర్తి మౌనం — ప్రసాదరావ్ భరించలేక పోయాడు.

" ఇక వెళ్దామా " అన్నాడతను లేస్తూ.

మధుమూర్తికూడా లేచి నడవ సాగేడు.

ప్రసాదరావ్ మధుమూర్తిని రూముదగ్గర డ్రాప్‌చేసి కారుని యింటికి మళ్ళించేడు.

మధుమూర్తి వరండాలో అడుగుపెట్టేసరికి రంగనాథం గారు మెల్లిగా పిలిచారు.

ఆయన పక్కనవున్న కుర్చీలో అయిష్టంగానే కూర్చు న్నాడతను.

"మధూ !..." వాత్సల్యంగా పిలిచారాయన.

"... నీతో ఒక విషయం మాట్లాడాలని చాలా కాలంనుంచి అనుకుంటున్నాను."

పెళ్ళివిషయం కాదుకద! అనుకున్నాడు మధుమూర్తి.

"కాని ఈమధ్య నువ్వు తీరుబడిగా కన్పించడం మానేశావ్ ..."

అతను మెల్లగా ఏదో గొణిగేడు.

"నీ వయసు... పాతిక దాటింది కదూ !"

"ఊఁ."

"అమ్మా నాన్నా పెళ్ళిచేసుకోమని తొందర చేయ డం లేదూ !"

మధుమూర్తి సమాధానం చెప్పలేకపోయాడు.

"ఏమైనా సంబంధాలు చూస్తున్నారా !... పెద్ద వాణ్ణి... నాదగ్గర సిగ్గెందుకయ్యా !" లాలిస్తూ అడిగే రాయన.

నిజానికి మధుమూర్తి సిగ్గుపడటం లేదు. భయపడు తున్నాడు.

"సంబంధం ఏనాడో స్థిరపడింది. ఈ నెలాఖరుకి పెళ్ళికూడా..."

తలుపువార నిల్చుని వింటున్న ప్రభావతికి ఒక్కసారి యావత్ప్రపంచమూ అంధకారమైపోయినట్లనిపించింది. ఆ చీకటి ఆమెను కబళిస్తున్నట్లై... భరించలేని ఆవేదనతో లోపలకు వెళ్ళిపోయిందామె.

రంగనాథంగారి ముఖం కళావిహీనంగా మారినా—చీకటిలాటి మసక వెల్తురు ఆ విషయాన్ని మరుగు పరచింది.

"అమ్మాయెవరు నాయనా!" కంపిస్తున్న గొంతు ప్రశ్నించింది.

"మామయ్య కూతురు విశాలాక్షి..."

"మంచిదే బాబూ! అమ్మాయి అదృష్టవంతురాలు."

కనుకొలకులనుంచి ఆనంద బాష్పాలలో, దుఃఖాశ్రువులో రెండు కన్నీటిబొట్లు తొంగి చూస్తూంటే తల తిప్పుకున్నారాయన.

ఆ రాత్రి... ఏమైనా సరే... ప్రభావతికి ఉత్తరం రాయాలనే సంకల్పించుకుని ఏం రాయాలా అని ఆలోచించసాగేడు మధుమూర్తి.

తన కథలలో ఎందరి విషయాలో రాయగల్గిన మధుమూర్తి స్వవిషయం వచ్చేసరికి— ఎంతమాత్రమూ కృతకృత్యుడు కాలేక రెండే రెండు వాక్యాలు రాసేడు.

"మిమ్మల్ని చాలా బాధ పెట్టేనని తెలిసినా- ఎందుకలా జరిగిందో రాయలేక పోతున్నాను ఎంత ప్రయత్నించినా. పెళ్ళికి వచ్చి విశాలాక్షిని చూస్తే... మీరు నన్ను క్షమించగలరనే నా ఆశ."

ఆ ఉత్తరం ప్రభావతికి చేర్చడం కూడా సమస్యే అయిందతనికి.

7

సోఫియా ఇండియా రాలేనని స్పష్టంగా రాసింది. దానితో రాజా ప్రభావతినే సోఫియాగా రూపొందించుకో గలనన్న ఆశతో సంబంధం స్థిరపరచుకునేందుకు తల్లితో సహా రంగనాథం గారింటికి వచ్చేడు.

అదే రోజున మధుమూర్తి తన ఊరికి ప్రయాణమయ్యాడు.

రాజా రాక- మధుమూర్తి ప్రయాణం- ప్రభావతికి గుండెల్లో దేవినట్లైంది. ఆమె నిరుత్సాహంగా గడిపిందా రోజంతా.

మధుమూర్తి తన యింట్లో అడుగు పెట్టేడు.

వాతావరణంలో ఎక్కడా ఏ విధమైన ఆనందమూ వ్యక్తం కావడం లేదు.

అమ్మా... నాన్నా... అందరూ ఏదో తప్పుచేస్తు న్నట్లు ముభావంగా తిరుగుతున్నారు.

ఇంటికి అలంకరణలు జరుగుతున్నయ్. కాని వాటి వల్ల ఆ యింటికి శోభ రావడంలేదు. ఒకవిధంగా బలికి తీసు కెళ్ళే మేకపిల్లకు పసుపూ కుంకుమా రాస్తున్నట్లుందా యింటిని అలంకరిస్తూంటే.

గృహవాతావరణం భరించలేక చెరువుగట్టుకి వెళ్లొద్దా మని బట్టలు వేసుకొని బయల్దేర బోయాడు.

"ఎక్కడకు నాయనా!" మల్లెపూవుల వంటి దుస్తులలో మిల మిల లాడుతున్న కొడుకుని చూస్తూ అడి గింది తల్లి.

"అలా షికారు వెళ్ళొస్తానమ్మా ..."

"ఫలహారం చేసి వెళ్ళు నాయనా..." ఆమెగొంతు గద్గదిక మైంది.

మధుమూర్తికి ముళ్ళకర్ర తగిలినట్లైంది.

అమ్మా!... తన ఆదరంతో... అభిమానంతో... ఇన్నాళ్ళూ తనని పెంచి పెద్ద చేసిన అమ్మ... తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమ్మ... ఈనాడు తనకు పెళ్ళి కాబో తోంటే కంటతడి పెడుతుందా!

అమ్మ విచారానికి కారణం— నాన్న ఏదో శిక్ష అనుభవిస్తున్నట్లు బాధ పడుతూండటంలో అంతరార్థం—

అన్నీ తనకు తెలుసు! ... తను పరిస్థితుల నర్థంచేసుకోగలడు. ఇలా జరుగుతుందని... ఐదేళ్ళ కిందటే తెలుసు.

ఇప్పుడు వీళ్ళంతా ఎందుకిలా అనవసరంగా బాధ పడ తారు! తన యీ పరిస్థితికి కారణం తనే. ఈ విషయంలో అమ్మా నాన్న ఎవ్వరూ బాధ్యులు కారు. ఆనాడు తనే విశాలాక్షిని చేసు కుంటానని అంగీకరించేడు.

"ఫలహారం తీసుకో మధూ! ..." ఎవరో వచ్చి పళ్లెం టేబుల్ మీద పెట్టి వెళ్ళేరు.

అమ్మ కాదు!... అవును. కన్నీటితో తడిసిన ముఖాన్ని కొడుక్కి కనుపించ నివ్వడం ఆమె కిష్టంలేక పోయింది.

మధుమూర్తి ఫలహారం చేసి చెరువు గట్టుకి బయల్దేరేడు.

త్రోవలో చిరకాల మిత్రుడు ఎదురై "కులాసాగా ఉన్నావా మధూ! అంటూ కుశల ప్రశ్నలు వేసేడు.

అతడు కూడా మధుమూర్తితో పాటే చెరువు గట్టుకి 'డవ సాగాడు.

"మీ అమ్మా నాన్నా బాగున్నారా శాస్త్రి!"

"ఊ"

శాస్త్రికి మధుమూర్తిపై విపరీతమైన జాలి వేస్తూంది. విశాలాక్షితో పెళ్ళికి ఎందు కంగీకరించాడో అర్థంకాలేదతనికి.

"చూడు మధూ!... ఏమీ అనుకో నంటే చిన్న సందేహం..."

"ఏమిటది?"

"నువ్వు నిజంగా విశాలాక్షిని..."

"నేనంగీకరించకపోతే నా పెళ్ళెలా జరుగుతుంది?"

శాస్త్రి ఇంకేమి ప్రశ్నించ లేదు.

ఇద్దరూ చెరువు గట్టున కూర్చొని నీటివంక చూస్తూ ఉండి పోయారు. మధుమూర్తి విశాలాక్షి నెందుకు చేసుకో వలసి వచ్చిందో ఆ వూళ్ళో చాలా మందికి తెలియదు. వారిలో శాస్త్రి ఒకడు.

సాయంత్రం క్రమ క్రమంగా చీకటి చీల్చుకుంది. తన కొచ్చిన అధికారాన్ని తనివిదీరా వినియో గించుకుని భూ దేవిని వెలుగు కప్పగించిపోయింది రాత్రి.

తెల్లవారింది.. మధుమూర్తి పనులన్నీ చూసుకొని బయటకు బయల్దేరాడు.

ఉదయం తొమ్మిది గంటలు. ఎండ మరీ వేడిగా

గోపాలస్వామి ఆలయంలో గోపాలుడు ఒంటరిగా ఉన్నాడు. భక్తులు పూజారీ అందరూ చాలాసేపై వెళ్ళిపోవడాన ఏకాంతంలో ప్రశాంతంగా ఉన్నాడా దైవం.

ఆలయం ముందు... నూరు వరహాల చెట్టుకింద నిలుచుని ఎదురు చూస్తున్నాడు. మధుమూర్తి.

కొద్దిక్షణాలలో విశాలాక్షి- మరో స్నేహితురాలూ వచ్చేరు.

మధుమూర్తిని చూడగానే స్నేహితురాలు విశాలాక్షిని విడిచి వెళ్ళిపోయింది.

" మధుమూర్తీ !...

ఆ పిలుపు గుండెల్లోకి దూసుకువెళ్ళి నిశ్చేష్టుడయ్యాడతను.

" ఎందుకు బావా అలా తెల్లబోతావ్, నా అందం చూసా !

ఎంత కాదనుకున్నా... ఆమె గొంతులోని కర్కశత్వం అతనికి స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

ఒక్కసారతనామెను పరిశీలనగా చూసేడు.

నల్లగా... సన్నగా... బాగాపొడుగ్గా...

స్నానం చేసింది కాబోలు ఉన్న కొద్దిపాటి జుత్తూ వికృతంగా...

"నాలో... ఏమూలేనా అందం ఉందేమో పరీక్షిస్తున్నావా!" నవ్విందామె. అలా నవ్వినప్పుడు ముందరి పళ్ళు రెండూ కోరల్లా బయటికొచ్చి...

మధు కనిపించి పోయాడు.

సౌందర్యారాధనకి అలవాటుపడ్డ అతని కళ్ళు అందాని కవతలి అంచుని చూడలేక మూసుకున్నయ్.

"ఒక్క క్షణానికే యింత బాధ పడుతున్నావ్! ఇక నన్ను జీవితాంతమూ ఎలా చూడగలవ్ బావా! చదువుకున్నవాడివి ... ఈ మాత్రం ఆలోచించలేదూ! పెళ్ళంటే ఒకనాటి ముచ్చట కాదుగా! భర్తో భార్యో ఎవరో ఒకరు కన్ను మూసేదాకా ఆ బంధం యిద్దరికీ..."

"విశాలా! ..."

"భయపడకు బావా!... నిన్నిలా కలుసుకోవడం- ఒక ప్రయోజనాన్ని ఆశించే కోరుకున్నాను. నా మాట మన్నించి వచ్చినందుకు కృతజ్ఞురాలిని. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. అనుమతిస్తావా!"

మధుమూర్తి అంగీకార సూచకంగా తల ఊపేడు.

"నువ్వు చాలా అందమైన వాడివి. అవువా!

"కావొచ్చు"

"మరి నేను!"

మధుమూర్తి సమాధానం చెప్పడం ఇష్టంలేక మౌనం దాల్చేడు.

"నేను కురూపిని బావా! ఆ విషయం చెప్పడాని కెందు కంత బాధ! నిన్నూ నన్నూ కలిపి ఒక ఖైదులో పెట్ట బోతున్నారు. దీనివల్ల నీకూ నాకూ ఎవరికీ సుఖ ముండదు.

నా జీవితం ఎలా గడవాలో ఎలా గడుస్తుందో నాకు తెలుసు. నా అదృష్టం వక్రించింది. కాని అందం, చదువూ అన్నీ ఉన్న నీకు నాలాంటి గతి పట్టడం అన్యాయం కాదూ! స్త్రీగా నేనే మగవాడికి ఆనంద మివ్వలేను. కారణం నా వికృత రూపం. నువ్వు చాలా చక్కని వాడివి. నీకు వచ్చిన స్త్రీని నువ్వు సుఖపెట్ట గలవ్."

"ఇప్పు డివన్నీ ఎందుకు విశాలా!"

"ఎంత పెఱ్ఱివాడివి బావా! రోటిలో తల దూర్చే ముందు— ఆ విషయం ఆలోచించడం అనవసర మంటావా!"

"నీ ఉద్దేశం సూటిగా చెప్పు విశాల."

"ఈ పెళ్ళి జరగకూడదని కోరుకుంటున్నాను బావా."

"విశాలా!"

"ఈ పెళ్ళి నీకూ నాకూ ఎవరికీ సౌఖ్యప్రదం కాదు. అల్పులకి అధికారమిచ్చినా నిలుపుకోలేరు. నన్ను చేసుకున్నంత మాత్రాన నేను సుఖపడతా ననుకోడం భ్రమే అని నాకు తెలుసు."

"విశాలా !"

"అది నీ లోపం కాదు బావా! స్త్రీ అయినా పురుషు డైనా అందమైన వాళ్ళలో ఆకర్షణుంటుంది. ముఖ్యంగా స్త్రీకి అందం లేకపోతే..." విశాల కంఠం కంపించింది.

"నిన్ను నేనేదో బాధిస్తాననుకుంటున్నావా విశాలా !"

"నువ్వు బాధించకపోయినా లోకం నన్ను చిత్రవధ చెయ్యక మానదు. నీలాటి కరూపికి అంతచక్కని భర్తా! అని అందరూ నాముఖానే ఆశ్చర్యపడతారు. ఉన్నతమైన స్థానం పొందడానికి అర్హత అవసరం. అనర్హులు అప్రయత్నంగా లభించిన అదృష్టాన్ని నిలుపుకోలేరు. నా పరిస్థితి నాకు తెలుసు. నేను చదివిన చదువూ— పెరిగిన వాతావరణమూ— నాకు కొంచం జ్ఞానం ప్రసాదించేయి.

రాధ జీవితం కళ్ళారా చూస్తూనే ఉన్నాను.... మళ్ళీ అటువంటి పొరపాటే నేనూ ఎందుకు చేయాలి !"

"రాధ !... రాధకేంలోటు !"

"ఏం లోటని కాదు ... ఆమె కేంమిగిలిందని అడుగు...

చెల్లెల్నిచ్చాక ఆమె కాపురం గురించి ఏమీ పట్టించుకోలేకపోయావ్... కారణం ఎక్కడో ఉద్యోగంలో ఉన్నావ్.

కాని యిక్కడ రాధ ఎలా బ్రతుకుతుందో తెలిస్తే..." ఆమె గొంతు బాధగా ఆగిపోయింది.

"చెప్పు విశాలా..." ఆత్రుతగా చూసేడు మధు మూర్తి.

"రాధ గుడ్డిది... అన్నయ్యకు తగిన భార్య కాదు. కళ్ళులేని పెళ్ళాన్ని కూడూ గుడ్డా పెట్టి పోషించడమే ఘన కార్యంగా భావిస్తూ అన్నయ్య... ఇష్టమొచ్చినట్లు చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడు..."

"కనీసం మీ నాన్నైనా మందలించ లేదా!"

"అదీజరిగింది. ఏదో ఖర్మకొద్దీ గుడ్డిదాన్ని కట్టబెట్టేరు నాకు. అంత మాత్రాన నాకు సరదాలు తీరొద్దా అని ఎదురుతిరిగేసరికి నాన్న మాట్లాడలేక పోయాడు. ఏం చెప్పేది బావా! దృష్టి ఉండగానే పొరపాట్లు జరుగుతాయ్. అది లేకపోతే... ఇక చెప్పేదేముంది!...

ఒకనాడు వదిన కాలికితగిలి ఖరీదైన గాజు సామాగ్రి బద్దలైందని... పశువుకంటే హీనంగా... ఆ దృశ్యం తలుచు కుంటే వళ్ళు జలదరిస్తోంది. అయినా మగవాళ్ళు నిరం కుశులు. వాళ్ళకన్ని అధికారాలుఉన్నాయి. ఆడది కేవలం బానిస. మగవాడి కోరికకే కాదు, అతని క్రోధానికి కూడా బలి కావలసినబానిస బావా!" విశాల దుఃఖం పట్టలేక పోయింది.

మధుమూర్తి! గుండెల్లో అగ్నిపర్వతాలు చెలరేగాయ్.

రాధ!... ఇన్ని బాధలు పడుతూ కాపురం చేస్తూందా!

"కాని... నేను అలా ప్రవర్తించను విశాలా! వాగ్దానం చేస్తున్నాను."

"ఇప్పుడిలాగే అనిపిస్తుంది బావా! కాని భర్త అనే పదవి లభించేసరికి ప్రతి మగవాడూ ఇంతో అంతో రాక్షసత్వం తెచ్చుకోక మానడు"

"ఐతే ప్రతి మగవాడూ రాక్షసుడే అంటావా విశాలా!"

"ఒకటి చెప్పగలను బావా! వాచా మనసా యిష్టం లేని ఆడదాన్ని కట్టుకునే ప్రతి మగవాడూ రాక్షసుడి కంటె హీనంగా ప్రవర్తించకుండా ఉండడు!"

"నేనూ అంతే అనే నీ వుద్దేశం విశాలా!"

"నువ్వూ మగవాడివే బావా!"

"ఈ విషయం చెప్పేందుకేనా యిలా పిలిపించావ్!"

"చెప్పదలుచుకున్నది ఒక్కటే బావా! మనపెళ్ళి జరగ కూడదు. దీనికోసం నువ్వూ నేనూ ఇద్దరమూ ప్రయత్నించాలి..."

"ఈ పరిస్థితిలోనా !"

"ప్రమాదం సంభవించబోతూందే తప్ప, సంభవించ లేదు బావా! ఒక్క క్షణం చాలదూ పరిస్థితులను జయించడానికి!... పోనీలే బావా ఆ ప్రయత్నమేదో నేనే చేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు."

"ఏం చేస్తావ్ విశాలా !"

"ఆడదాన్ని ఏం చేయగలను !"

ఇంతలో స్నేహితురాలు తొందరగా పరుగెత్తుకొచ్చి కోవెల కెవరో వస్తున్నారని చెప్పడంతో మధుమూర్తి విశాలాక్షి ఇద్దరూ ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

నాలుగు రోజులు గడిచాయ్...

విశాలాక్షి యింట్లో అందరూ ఆత్రుతగా ఉన్నారు.

రెండు రోజులనుంచి ఆమెకు గుండెనొప్పి వస్తోంది.

డాక్టరొచ్చి ఖరీదైన మందులు వాడుతున్నా ఏమా త్రమూ ఫలితం కనిపించడంలేదు.

నొప్పి వచ్చినప్పుడల్లా సుడులుతిరిగి పోతుందామె.

కన్నతండ్రి విపరీతంగా బాధ పడుతున్నాడు.

పెళ్ళే కాదనుకున్న కూతురికి... అందమైనవాడూ చదువుకున్నవాడూ భర్తగా లభించబోతున్న యీ తరు

ణంలో అనుకోని ఆవాంతరం వచ్చింది. ఈ ముహూర్తం దాటితే వచ్చే సంవత్సరం వరకూ పెళ్ళి చేయడానికి వీల్లేదు.

ఉదయంనుంచి మూసినకన్ను తెరువకుండా పడు కున్న విశాలాక్షి సాయంత్రం కన్ను తెరచి చూసింది.

"కాఫీ కావాలా విశాలా!" అప్యాయంగా అడిగింది తల్లి.

"ఊఁ" కాఫీ తాగి ఒక్కసారి తల్లివంక చూసింది.

"ఈ గదిలోకి ఎవర్నీ రానీయకమ్మా... నాకు విశ్రాంతి కావాలి..."

తల్లి వెళ్ళగానే తలుపు గడియ వేసుకుంది విశాలా.

అర్ధరాత్రయినా నిద్రపట్టలేదు మధుమూర్తికి...

విశాలా అందగత్తె కాదు. కురూపి. ... కాని ఆమె చదువుకుంది. ఆలోచించ గలిగే శక్తుంది. అంతేకాదు. తన సుఖం కోసం త్యాగం చేయడానికైనా సిద్ధపడింది.

అర్ధరాత్రి పన్నెండు గంటలు.

విశాలాక్షి ఇల్లదిరిపోయేలా ఒక్క కేక వేసింది. అది విని తల్లీ తండ్రీ పడుగెత్తు కొచ్చారు.

"ఏమైంది తల్లీ! బాధగా ఉందా!"

సమాధానం లేదు' విశాలాక్షి రెండు చేతులూ గుండె లకు గట్టిగా నొక్కి పట్టుకుంది.

ఆమె కళ్ళల్లోంచి కన్నీరు ప్రవహిస్తోంది. ఆముఖంలో బాధ స్పష్టంగా కనిపిస్తున్నది

"నేనింక బతకను..."

"అమ్మా విశాలా! .." తల్లి తండ్రీ దుఃఖంతో ఆమె తల నిమురసాగేరు.

"ఈ పెళ్ళి... ఈ పెళ్ళి ఆపుచేయ్యండి..."

"విశాలా!...నువ్వు కోలుకుంటావమ్మా...డాక్టర్ని పిలుస్తానుండు"

"వద్దు నాన్నా... నాకు తెలుసు... నేనిక బతకను అబ్బా!...

తల్లి ఏడుపు ఆపుకోలేక పోతూంది.

తండ్రి నిశ్చేష్టుడై నిలుచున్నాడు.

"ఈ పెళ్ళి... ఆపవూ నాన్నా!... దీని వల్ల నాకేమీ సుఖం లేదు... నన్ను మీ దగ్గరే ఉండనివ్వండి.

విశాలాక్షిని చూడలేక పోయారిద్దరూ.

చివరకు తండ్రి "అలాగేనమ్మా." అన్నాడతి కష్టంగా.

విశాలా భారంగా నిట్టూర్చింది.

సూర్యోదయం అయింది. చీకట్లుంవిడిపోయాయ్.

పందిట్లో విశాల తండ్రి ఒక్కడూ కూర్చున్నాడు.

పెళ్ళి కూతురికీ— పెళ్ళి కొడుక్కీ మధ్యకల అంతరం దృష్టిలో పెట్టుకోవడాన పెళ్ళి కాట్టేమందిని ఆహ్వానించ లేదు. విశాలాక్షి తల్లిదండ్రులు. తాము చేస్తూన్నపనిలో అన్యాయం ఉందేమో అన్న భయం వారికి మొదటనుంచీ ఉండనేఉంది. అందుకే వారిల్లు బోసిపోతున్నట్లు నిర్జనంగా ఉంది.

" ఈ విషయం... ఎలాగైనా చెప్పక తప్పదు"

విశాలాక్షి తండ్రి మెల్లగా లేచాడు. తొట్రుపడు తున్న పాదాలతో మగపెళ్ళి వారింటివంక నడివసాగేడు.

* * * * *

" పాలు తీసుకో అన్నయ్యా !"

" ఈ మేడమెట్లన్నీ నువ్వెందుకెక్కేవు రాధా! ఎవరినైనా పంపలేక పోయావూ!"

" ఫరవాలేదులే... ఇక్కడ నువ్వూ నేనూ కాక ఇంకెవరైనా ఉన్నారా అన్నయ్యా!"

" లేదు రాధా!"

"చిన్న విషయం అడుగుతాను నిజం చెప్తావా అన్నయ్యా!

"ఏమిటి రాధా!"

"ఈ పెళ్ళి— నీ కిష్టం లేదు కదూ!"

"ఎవరన్నారమ్మా అలా"

"కంటితో చూడలేకపోయినా మెదడుతో గ్రహించగల నన్నయ్యా. గుడ్డిదాన్నైన నా కోసం..."

"తప్పురాధా! అలా అనకు... ఉండు... ఎవరో పిలుస్తున్నారు"

మధుమూర్తి మేడదిగి వెళ్ళిపోయాడు.

విశాల...విశాలాక్షి... తనెందుకు చేసుకో కూడదు! స్త్రీకి ఒక్క అందమే ప్రధానమా, ఆత్మ సౌందర్యం...

"నాన్న ఉన్నరా మధూ!"

"ఉన్నారు మామయ్యా... పిలుస్తానుండు." గేటు దాటబోతున్న మధు వెనక్కి మళ్ళేడు.

"మీ అందరికీ ఒకవిషయం చెప్పాలనివచ్చాను బావా! చెల్లెల్ని కూడా పిలువ్ .."

మధుమూర్తి తల్లిదండ్రులు ఇద్దరూవచ్చి కూర్చున్నారు.

"నువ్వుకూడా కూర్చో బాబూ! అసలీవిషయం నీకు సంబంధించినదే."

మధుమూర్తి ఆశ్చర్యంగా చూసేడు.

"ఈ పెళ్ళి— మీ కెవరికీ ఇష్టంలేదు... అవునా!"

ముగ్గురిలోనూ చలనంలేదు. ఈ ప్రశ్న చాలా కాలం నుంచీ అందర్నీ వేధిస్తూనా్న... ఎవరూ సమాధానం చెప్ప డానికి సాహసించలేక పోతున్నారు.

"బహుశా, యీ పెళ్ళి జరిగితే సంతోషించేది నే నొక్కడినేయేమో. ఆఖరికి విశాలకూడా యీ పెళ్ళి జరిపిస్తే ఉరిపోసుకు చచ్చిపోతానంది!"

"బావా!" మధుమూర్తి తండ్రి విస్తుపోయాడు.

"ఇన్నాళ్ళూ అదలాగేఅంటునా్న పట్టించుకోలేదు.. కాని చివరకు దానిమాట వినక తప్పలేదు."

మధుమూర్తి స్థాణువులా కూర్చుండి పోయాడు.

"ఎవరికీ ఇష్టంలేని పెళ్ళి- ఆగిపోవడం మేలుకాదూ!"

ఈ వితర్కపరిస్థితిలో ఎవరికీ నోట మాటరాలేదు..

తెల్లవారితే జరగవలసిన పెళ్ళి... ఆగిపోతుంది.

"మధుమూర్తికి వేరే సంబంధం చూడండి.."

ఆయన వారి మౌనాన్నే అంగీకారంగా భావించుకుని వెళ్ళిపోయారు.

ఆ యింట్లో అందరి ముఖాల్లోనూ గంభీరత ఆవరించింది. ఏ పెళ్ళిని ఆపదగా భావించారో అది తొలగిపోయినా వారికి ఆనందం కలిగించలేక పోయింది.

సాయంత్రం మధుమూర్తి విశాలాక్షిని కలుసుకోవాలని బయల్దేరేడు.

"నువ్వా నాయనా !... ఏంకావాలి !"

" విశాలను కలుసుకోవాలత్తయ్యా !"

"ఆ గదిలో ఉంది వెళ్ళు బాబూ..." కన్నీటిని తుడుచుకుంటూ వెళ్ళిపోయిందావిడ.

" విశాలా !..."

" ఏం బావా! "

" నా మాటవిని..."

" ఒకరి మాటలు వినివిని విసిగిపోయాను బావా!... నాకు విశ్రాంతి కావాలి. నువ్వెళ్ళు బావా !... ఈ పెళ్ళి ఆగినందుకు చాలా సంతోషంగా ఉందినాకు. కనీసం నువ్వైనా సుఖపడు." ఆమె ఇంకేమీ అనకుండా కళ్ళుమూసుకుంది.

మధుమూర్తి యింటికి వచ్చేసరికి ప్రభావతి గుర్తొచ్చింది. ప్రభావతి... శారద...

త్వరత్వరగా బట్టలు సర్దుకుని "విశాఖపట్నం వెళ్తాను నాన్నా." అన్నాడు.

"ఇప్పుడా !... ఎందుకు ? ఏమంత తొందర ?"

"తొందరగానే వెళ్ళాలి నాన్నా."

తల్లితో చెప్పి స్టేషన్‌కి బయల్దేరేసరికి రాత్రి ఎనిమిది దాటింది. స్టేషన్‌లో కనుక్కుంటే రైలు లేటన్నారు.

రైలు తప్ప గత్యంతరం లేదు... టాక్సీలు దొరకవా చిన్నఊళ్ళో.

ఎక్కడో ప్రమాదం జరగడాన రాత్రి ఒంటిగంటకు వచ్చింది రైలు. మధుమూర్తి రైలులో కూర్చున్నాడు. రెండువందలమైళ్ళు ! ... ఎప్పటికి చేరుతుందీ రైలు ?

ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడంలేదు.

ప్రతి స్టేషనులోనూ గంటలతరబడి నిలబడి పోతుందా రైలు అనిపించిందతనికి.

ఉదయం ఐదు గంటలప్రాంతాన అతని కనులు మూతలు పడ్డాయ్.

రైలు మెల్లగా ఒంటిగంటకు విశాఖపట్నం చేరింది.

బ్యాగ్‌తో దిగి బయటకు వచ్చాడు మధుమూర్తి.

వాల్తేరు స్టేషన్‌లో టాక్సీ దొరకడంకూడా కష్టమే... ఆనాడేదో సమ్మెకావడాన రిక్షాలుకూడా లేవు.

వడివడిగా అడుగులు వేయసాగేడతను.

సరిగ్గా తన వీధికొచ్చేసరికి... మలుపు దగ్గర ఒక్క క్షణం ఆగేడు.

తన గదిముందర పెళ్ళి పందిర !

ప్రభావతికి... పెళ్ళి అవుతూందా ! మరి తనకి శుభ లేఖైనా పంపలేదేం!

"ఎప్పుడొచ్చారు బాబూ!" మధుమూర్తికి తెలిసిన వ్యక్తి పలకరించాడు.

"ఇప్పుడే..."

"ఉదయం రావలసింది బాబూ, రంగనాధంగారి కూతురికి..."

"ఆపెళ్ళి చూడాలనేవచ్చాను..కాని రైలులేటు..."

"పాడు రైళ్ళు... ఎప్పుడూ లేటే బాబూ..."

అతను వెళ్ళిపోయాడు.

పెళ్లివారి హడావిడి మధుమూర్తికి స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఉన్నట్లుండి బాజాలు మోగసాగేయ్. సన్నాయి మేళం...

భరించలేక వెనుదిరిగాడు మధుమూర్తి.

టాక్సీ !

అప్రయత్నంగా ఎక్కికూర్చున్నాడు.

"ఎక్కడికి!"

ఎడ్రసిచ్చాడు.

ఆ భవనంముందు టాక్సీ ఆగింది.

గేటుతీసి లోపలకి ప్రవేశించిన మధుమూర్తికి ఒక్కసారి మనుషులూ పరిసరాలూ అన్నీ మారిపోయాయా అన్పించింది. మెల్లగా మేడెక్కి ప్రసాదరావ్ గదిలో అడుగు పెట్టేడు.

అతను వాలుకుర్చీలో కూర్చుని ఎటో శూన్యంలోకి చూస్తున్నాడు.

"రావ్ !..."

అతను చూసేడు...

గెడ్డంపెరిగి... కళ్ళులోతుకిపోయి...

"అలా ఉన్నారేం!" ఆత్రుతగా అడిగేడు మధుమూర్తి.

"ఇంకెలా ఉండమంటారు!"

"శారదేదీ!"

"శారద !... మీకూ... నాకూ... అందరికీ..."

" ఏమిటి ! ఏంజరిగింది ! త్వరగా చెప్పండి రావ్. ప్లీజ్ ...

" శారద... మరణించింది..."

" వాట్ !... శారద... శారద చచ్చిపోయిందా ! ఎలా !

" మతి సరిగా లేనప్పుడూ కారేసుకు బయల్దేరింది. అరవై మైళ్ళ స్పీడులో వంతెనను గుద్ది..."

మధుమూర్తికి నోట మాట రాలేదు.

ఆనాడు తనేం జరుగుతుందని భయపడ్డాడో సరిగ్గా అదే జరిగిందీనాడు. శారద !...

కర్చీఫ్‌తో కనులద్దుకొని కూలబడ్డాడతను.

కళ్ళముందు గతమంతా కదులుతూంది.

విశాలాక్షి కారణంగా తను శారదకీ ప్రభావతికీ దూరమయ్యాడు. చివరకా విశాలాక్షికూడా తనకు దూరమేఐంది.

తనూ, విశాలాక్షి... ప్రభావతీ... శారద... నలుగురూ చదరంగంలో పావుల మాదిరి...

బాజాలూ మేళాలూ... క్రమక్రమంగా దగ్గరౌతున్నాయ్.

మధుమూర్తి కిటికీలోంచి చూసేడు.

ఎవరికో పెళ్ళయింది కాబోలు ఊరేగుతున్నారు!

ఆ శబ్దాలు ... ఆ కోలాహలం భరించలేక కిటికీ రెక్కలు మూసి సోఫాలో కూలబడ్డాడు మధుమూర్తి.

ప్రసాదరావతనివంక దీనంగా చూసి దృష్టిమరల్చుకున్నాడు.

" మానవులు కేవలం నిమిత్తమాత్రులు మూర్తీ! మంచీ... చెడూ, సుఖమూ, దుఃఖమూ ఏదీ వారిచేతిలో లేదు." విరాగిలా అన్నాడు ప్రసాదరావ్.

మధుమూర్తి కతని మాటలు వినిపించ లేదు. ఒక విధమైన స్తబ్దత అతనావరించింది.

వేమన పంచాయతీ గ్రంథాలయం,
తేలప్రోలు :: కృష్ణా జిల్లా.

సమాప్తమ్

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక	
పుస్తకం సంఖ్య	TPLA111B157
పుస్తకం పేరు	దైవనిర్ణయం
తారీఖు	26/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	129
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	NO
తయారు చేసినది	pragathi
పేజీలు విడదీసినది	Sowmya
స్కాన్ చేసినది	thasin
పరీక్ష చేసినది	prathyusha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good